# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 189 | విశాఖపట్నం | 10-4-2026 శుక్రవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 189 | VISAKHAPATNAM | 10-4-2026 FRIDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



SBI

PATHAKAM NEWS

SCAN & PAY

UPI ID: 44576280686@sbi

BHIM | UPI | yono SBI | BHIM SBI Pay | G Pay | Paytm | Pay


## సామాన్య ప్రజల ఆస్తులకు భద్రతే లక్ష్యం.. అందుకే కొత్త పాసు పుస్తకాలు

# ఇస్తున్నాం: చంద్రబాబు

**బాపట్ల, పతాకం న్యూస్:** భూమి అనేది కేవలం ఆస్తి మాత్రమే కాదని అది జీవనాధారం, భద్రత, గౌరవమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సామాన్య ప్రజల ఆస్తులకు భద్రత ఇవ్వాలనే లక్ష్యంతోనే పట్టాదారు పాసు పుస్తకాలు ఇస్తున్నట్లు బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని సూరేపల్లిలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజల సమస్యలు పరిష్కరించడానికే ఇక్కడకు వచ్చినట్లు చంద్రబాబు తెలిపారు. పట్టాదారు పాస్‌పుస్తకం తమ చేతికందినప్పుడు ప్రజల్లో కలిగిన సంతోషం చూసి జన్మ ధన్యమైందని సీఎం అన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రం ఎంత విధ్వంసం అవ్వాలో అంత అయిందని, వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకండా పోయిందని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులతో 23 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. జగన్ పాలనలో వ్యవస్థలు గాడి తప్పాయన్న సీఎం వాటిని ఇప్పుడు కూటని ప్రభుత్వం దారిలో పెడుతూ వస్తుందన్నారు. గత ప్రభుత్వంలో నాయకులు ప్రజల భూమిపై కన్నేశారని మండిపడ్డారు. ప్రతి గ్రామంలో, ప్రతి ఇంట్లో భూ వివాదాలకు తెరలేపారని, పట్టా పుస్తకంపైన జగన్ ఫొటో వేసుకున్నారని గుర్తు చేశారు. ఆస్తి మీదైతే- ఫొటో ఆయనది ఉండేదని అన్నారు. గత పాలకులు చేసిన అక్రమాలు, పాపాలు ఇప్పటికీ ఇంకా వెంటాడుతున్నాయని చంద్రబాబు పేర్కొన్నారు. గత పాలకులు చేసిన పనులు చూస్తే మతిపోయిందని, నూటికి 90 శాతం రెవెన్యూ సమస్యలపైనే ఆర్జీలు వచ్చేవని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మీకు భూ హక్కు ఇచ్చే బాధ్యత తీసుకోవాలని అప్పుడే సంకల్పించినట్లు చంద్రబాబు తెలిపారు. 1.12 కోట్ల పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చే బాధ్యత తీసుకుంటానన్నారు. 16,816 గ్రామాలు రీ సర్వే చేయాలన్నారు. ఇప్పటికే 21.23 లక్షల కొత్త పాస్ పుస్తకాలు ప్రజలకు ఇచ్చామని తెలిపారు. జూలై నాటికి 9 లక్షల పాస్ పుస్తకాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇంకా 80 లక్షల పాస్ పుస్తకాలు ఇవ్వాలని



చంద్రబాబు వివరించారు. 'మీకు ఇచ్చే పాస్ పుస్తకాలను ఎవరూ తారుమారు చేయలేరు. కరెన్సీకి వాడే సాంకేతికతే పట్టాదారు పాస్ పుస్తకాలకు వాడాం. మీ ముందు సర్వే చేయించి రికార్డు చేస్తాం. ఈకేవైసీ చేశాకే పట్టాదారు పాస్ పుస్తకం ఇస్తాం. భూ యజమాని సమక్షంలో మొత్తం ప్రక్రియ నిర్వహిస్తున్నాం. రూపాయి కూడా అవినీతి లేకుండా పాస్ పుస్తకాలు ఇవ్వాలనేది నా ఆలోచన. రికార్డులు ట్యాంపర్ కాకుండా బ్లాక్ చైన్ టెక్నాలజీ తెచ్చాం. పుస్తకాలపై క్యూఆర్ కోడ్ ఇచ్చాం. మీ భూమి వేరే ఎవరూ రిజిస్ట్రేషన్ చేసుకోకుండా రికార్డులకు డిజిటల్ లాక్ చేసుకునే అవకాశం కల్పించాం. భూ సమస్యలకు శాశ్వతంగా పరిష్కారం చూపిస్తున్నామని (తరువాయి 2వ పేజీలో)



2లో

## మీడియాపై ఏ పార్టీ దాడి చేసినా నేను ఖండిస్తా: వెంకయ్యనాయుడు



5లో

## భారత్‌లో పెరుగుతున్న తీవ్ర అసమానతలు!




6లో

## 'దగ్గు'ను ఇంట్లోనే తగ్గించుకోవచ్చా? డాక్టర్ దగ్గరికి వెళ్లాలా?

## రాజకీయ నేతల యువతకు ఆదర్శంగా ఉండాలి: అయ్యన్నపాత్రుడు

**అమరావతి, పతాకం న్యూస్:** ప్రస్తుతం సమాజంలో కనిపిస్తున్న రాజకీయాలను యువత ఏవగించుకుంటున్నారని ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. గోవాలో పశ్చిమ ప్రాంత కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సదస్సులో స్పీకర్ పాల్గొని ప్రసంగించారు. చట్టసభల్లో రభస చేయడానికి మాత్రమే పరిమితమై.. సభకు హాజరు కాకుండా జీతభత్యాలు తీసుకునే ఎమ్మెల్యేలు ఉన్నారన్నారు. వీళ్లు కళ్లేదురుగా కనిపిస్తుంటే యువతరానికి రాజకీయాలు అంటే గౌరవం ఎలా కలుగుతుందని ప్రశ్నించారు. ఈ ధోరణి మారాలంటే రాజకీయ నాయకుల నడవడిక మారాలని సూచించారు. చట్టసభల్లో వారి ప్రవర్తన, పనితీరు ఆదర్శప్రాయంగా ఉండాలన్నారు. విద్యార్థి దశలో రాజకీయాలకు దాదాపు తెరపడిందని స్పీకర్ తెలిపారు. రాజకీయ ప్రయోగశాలగా ఉండే విశ్వవిద్యాలయాల నుంచి విద్యార్థులు రాజకీయాల్లో ప్రవేశించడం దాదాపు శూన్యం అయిందని అయ్యన్నపాత్రుడు తెలియజేశారు.





## బెంగాల్‌లో బీజేపీ అద్భుత విజయం సాధిస్తుంది: మోదీ

2లో


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..

అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..

పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH


## అల్లూరి జిల్లాలో విషాదం.. మల్లంగుమి జలపాతంలో పడి

# ముగ్గురు బాలికలు మృతి

**అల్లూరి జిల్లా, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో సెల్ఫీ సరదా ముగ్గురు యువతుల ప్రాణాలను బలితీసుకుంది. అనంతగిరి మండలం మూలగుమ్మి గ్రామ సమీపంలోని జలపాతం వద్ద సెల్ఫీ తీసుకుంటుండగా నలుగురు యువతులు ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయారు. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా.. ఒకరిని స్థానికులు కాపాడారు. మృతులు జంబువలస గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. ప్రమాదకర ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సెల్ఫీల కోసం ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

వివరాల్లోకి వెళితే.. బూర్జ పంచాయతీ పరిధిలోని జంబువలస గ్రామానికి చెందిన నలుగురు యువతులు సరదాగా గడిపేందుకు మూలగుమ్మి సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న జలపాతానికి వెళ్లారు. అక్కడ జలపాతం అందాలకు ముగ్ధులైన అమ్మాయిలు.. ఆ దృశ్యాలను తమ ఫోన్లలో బంధించాలని ప్రయత్నించారు. ఈ క్రమంలో జలపాతం



అంచున నిలబడి సెల్ఫీలు తీసుకుంటుండగా.. ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడిపోయారు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో ముగ్గురు యువతులు త్రిష, రత్న కుమారి, పవిత్ర నీటిలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. మరో యువతి అంజలి నీటిలో మునిగిపోతుండగా గమనించిన స్థానికులు.. ప్రాణాలకు తెగించి ఆమెను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఈ మూలగుమ్మి జలపాతం అనంతగిరి, హుకుంపేట మండలాల సరిహద్దులోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఉంది. దీంతో సహాయక సిబ్బంది అక్కడికి చేరుకోవడానికి కొంత సమయం పట్టింది. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాలను వెలికితీశారు. మృతులంతా ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో జంబువలస గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తమ కళ్ల ముందే ఆడుతూ పాడుతూ తిరిగిన యువతులు ఇలా అచేతనంగా పడి ఉండటం చూసి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కన్నీరుమున్నీరవుతున్నారు.

### ద్వారకా తిరుమలలో నకిలీ దర్శనం టిక్కెట్ల దందా వ్యవహారం

## 9మంది అరెస్టు



**ఏలూరు, పతాకం న్యూస్:** రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమలలో నకిలీ దర్శనం టిక్కెట్‌ల దందా వ్యవహారంలో ఒక ముఠాను జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. గురువారం ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ .... గత సంవత్సరం నుంచి ఈ దందా జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. 8 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతోపాటు ఒక ఎన్ఎంఆర్ ఉద్యోగి అరెస్టయ్యాడని తెలిపారు. ఇప్పటికి మొత్తం 9మంది అరెస్టయ్యారని చెప్పారు. ఈ కేసులో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి మరింత మందిని అరెస్ట్ చేసే అవకాశం ఉందని, విచారణ ఇంకా ముగియలేదు అని స్పష్టం చేశారు.

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## చెంపపెట్టు..

తమిళనాడు తూత్తుకుడిలో ఎటువంటి నేర చరిత్ర లేని తండ్రీ కొడుకులను పోలీసులు అమానుషంగా పొట్టన బెట్టుకున్న కేసులో మదురై కోర్టు ఇచ్చిన సంచలన తీర్పు అధికార దురహంకారానికి చెంపపెట్టు. మొబైల్ ఫోన్ షాపు నిర్వహించుకుంటున్న జయరాజ్ (58), అతని కుమారుడు బెనిక్స్ (31) హత్య కేసులో నేరస్తులుగా తేలిన తొమ్మిది మందికీ రెండు మరణ దండనలు విధించడం, కుటుంబ సభ్యులకు పోలీసులు రూ.1.40 కోట్లు నష్టపరిహారం కింద చెల్లించాలని తీర్పు చెప్పడం కేసు తీవ్రతకు అద్దంపట్టేవే. అత్యంత అరుదైన కేసుల్లోనే ఉరి శిక్ష విధించాలన్నది సుప్రీంకోర్టు దిశానిర్దేశం. అరుదైన కేసుల్లోనే అత్యంత అరుదైన కేసుగా దీనిని పేర్కొంటూ శాంతిభద్రతలను రక్షించాల్సిన పోలీసులే చట్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించారని ట్రయల్ కోర్టు న్యాయమూర్తి పేర్కొన్నారు. 2020 కరోనా లాక్‌డౌన్ సమయంలో అనుమతించిన వేళలను అతిక్రమించి షాపు తెరిచారన్న చిన్నపాటి కారణంతో నిరాయుధులైన ఆ ఇద్దరినీ ఒక రాత్రంతా పోలీస్ స్టేషన్‌లో ఉంచి, విచక్షణారహితంగా, పైశాచికంగా దాడి చేశారని, ఆ చిత్రహింసల గురించి చదువుతుంటేనే తీవ్ర దిగ్భ్రాంతి కలుగుతోందని, దోషులకు యావజ్జీవంతో సరిపెడితే... ఇలాంటి నేరాలకు పాల్పడే వారికి భయం లేకుండా పోతుందని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. కక్షతో ఈ ఘాతుకానికి పాల్పడటం అధికార అహంకారానికి పరాకాష్ట. తన సహచరుల దారుణాలను ధైర్యంగా కోర్టు ముందుంచి, శిక్షపడేలా చేసిన ప్రత్యక్ష సాక్షి, హెడ్ కానిస్టేబుల్ రేవతి అభినందనీయులు. బిజెపికి మిత్రపక్షంగా ఉన్న అన్నాడిఎంకె హయాంలో జరిగిందే ఈ దారుణం. ఆ రాష్ట్రంలో 2022 నుంచి ఇప్పటివరకూ అక్కడి పోలీసుల చిత్రహింసలకు 17 ఏళ్ల బాలుడుసహా 24 మంది బలయ్యారు. ఈ కేసును కోర్టు సుమోటోగా స్వీకరించడానికి, సిబిఐ విచారణ జరపడానికి ప్రధాన కారణం తమిళనాడు ప్రజలు, ప్రజాసంఘాలు, వాణిజ్య సంఘాల ఆందోళనలే. ప్రజాచైతన్యమే బాధితులకు న్యాయం జరగడానికి కారణమవుతుందన్న సత్యాన్ని ఈ కేసు చాటిచెబుతోంది. జస్టిస్ చంద్రు ఇలాంటి ఘటనకు సంబంధించి బాధితుల పక్షాన పోరాడిన ఉదంతం 'జై భీమ్' చిత్రంగా ప్రజలందరి మన్ననలు పొందిన సంగతి తెలిసిందే. మానవ హక్కుల ఉల్లంఘనలను అరికట్టడానికి అన్ని పోలీస్ స్టేషన్లలో సిసి టీవీలు ఏర్పాటు చేయాలని 2018లోనే ఆదేశించినా ఇప్పటికీ ఆచరణ రూపం దాల్చలేదు. తాజాగా ఈ అంశంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు కేంద్ర హోం శాఖ కార్యదర్శి తమ ముందు హాజరు కావాలని తాజాగా ఆదేశించడం మంచి పరిణామం. లోక హితం కోసం ఇచ్చిన అధికారం దుర్వినియోగమైన సందర్భంలో రాజ్యాంగం ఇచ్చిన అధికారాలను ఉపయోగించుకుని సరిచేసేందుకు అవకాశముందని ఈ తీర్పు ద్వారా ధర్మాసనం భరోసా కల్పించడం ముదావహం. తమిళనాడులోనే కాదు దేశవ్యాప్తంగా ఇలాంటి అమానుషాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. మాచర్లలో ప్రేమ వివాహం చేసుకున్న యువతి చౌడేశ్వరిని భర్త నుంచి బలవంతంగా తీసుకొచ్చి, ఆమె తండ్రికి అప్పగించి, హత్యకు కారణమయ్యాడన్న ఆరోపణపై మాచర్ల పట్టణ సిఐ సస్పెన్షన్‌కు గురవడం రాష్ట్రంలో పరిస్థితి తీవ్రతకు ఉదాహరణే. రించి... ప్రభుత్వాలు మారిన తరువాత జైలు గోడలు లెక్కిస్తూ, కోర్టుల చుట్టూ తిరుగుతున్న ఉదంతాలు దేశంతోపాటు రాష్ట్రంలో నిత్యం కనిపిస్తున్నవే. అధికారంలో ఉన్న వారు, తమకు భారీ మొత్తంలో డబ్బు ముట్టజెప్పే వారి కోసం అడ్డగోలుగా ఖాకీలు వ్యవహరించడం, పేదలు, సామాన్యుల కోసం ఉద్యమించే వారిపై జులుం ప్రదర్శించడం సర్వసాధారణంగా మారిపోయింది. ప్రజాస్వామిక వ్యవస్థలో ఇలాంటి నిరంకుశ పోకడలను అనుమతించరాదు. ఈ ఏడాది కస్టడీ మరణాల్లో తొలి ఐదు స్థానాల్లో ఉన్నవి బిజెపి పాలిత రాష్ట్రాలే. బీహార్‌లో 19, రాజస్థాన్‌లో 18, ఉత్తరప్రదేశ్‌లో 15, గుజరాత్‌లో 14 కస్టడీ మరణాలు సంభవించాయని కేంద్ర హోం మంత్రిత్వశాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పరిస్థితి మరింత తీవ్రమైందనడానికి అడ్డగోలుగా పెడుతున్న యుఎపిఎ, దేశద్రోహం కేసులు, నిర్బంధాలే సాక్ష్యం. భీమా కొరెగావ్ కేసులో స్టాన్‌స్వామి లాంటి వారి మరణానికి కారణం కావడం, ది వైర్, గుజరాత్ న్యూస్ పోర్టల్ ఎడిటర్లపై తప్పుడు కేసులు పెట్టి వేధించడం, రైతు ఉద్యమంపై నిర్బంధం, ఢిల్లీ అల్లర్ల కేసులో కమలం పార్టీ పెద్దలను తప్పించి మిగిలిన వారిని అమానుషంగా జైలు పాలు చేయడం లాంటి ఘటనలెన్నో! మన రాష్ట్రంలో ఆర్సెలార్ మిట్టల్ భూసేకరణ బాధితుల తరపున ఉద్యమించిన అప్పలరాజును అరెస్టు చేసి నిర్బంధించడం లాంటి ఉదంతాలెన్నో కళ్ల ముందున్నాయి. తూత్తుకుడి వంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలంటే నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేయడం ఒక్కటే మార్గం.

## మీడియాపై ఏ పార్టీ దాడి చేసినా నేను ఖండిస్తా: వెంకయ్యానాయుడు



**చిత్తూరు, పతాకం న్యూస్:** మీడియా స్వేచ్ఛ, మాతృభాష ప్రాముఖ్యతపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. చిత్తూరులోని ఎన్వీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల స్నాతకోత్సవంలో పాల్గొన్న ఆయన, నూతన వసతి గృహాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇటీవల మీడియా సంస్థలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో ఆయన స్పందిస్తూ... వార్తల్లో అసత్యాలు ఉంటే శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ఎవరికైనా ఉంటుందని, కానీ భౌతిక దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యంలో మంచి పద్ధతి కాదని హితవు పలికారు. పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించే చర్యలను ఏ రాజకీయ పార్టీ చేసినా తాను తీవ్రంగా ఖండిస్తానని స్పష్టం చేశారు. మాతృభాషను మర్చిపోవడం అంటే అమ్మను మర్చిపోవడమేనని, జన్మనిచ్చిన తల్లిని, ఊరిని, దేశాన్ని ఎప్పుడూ గౌరవించాలని విద్యార్థులకు సూచించారు. సోషల్ మీడియా ఊబిలో పడి సమయాన్ని వృథా చేయవద్దని, చదువుతో పాటు ఆటలకు, యోగాకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాజకీయ వారసత్వానికి తాను వ్యతిరేకినని, అయితే సేవా కార్యక్రమాలు కొనసాగించే కుటుంబాలను ప్రోత్సహిస్తానని వెల్లడించారు. ఆహారపు అలవాట్లను మార్చుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

## బెంగాల్‌లో బీజేపీ అద్భుత విజయం సాధిస్తుంది: మోడీ



**పశ్చిమ బెంగాల్:** బెంగాల్ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, బీజేపీ అద్భుత విజయం సాధిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. హల్దియాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ఐదేళ్ల క్రితం నందిగ్రామ్‌లో మమతా బెనర్జీ ఓడిపోయారని గుర్తు చేశారు. ఈసారి రాష్ట్రమంతా అదే ఫలితం వస్తుందని అన్నారు. ఇప్పుడు భవానీపూర్‌లో (మమతా బెనర్జీ పోటీ చేస్తున్నారు) కూడా అదే ఫలితం వస్తుందని అన్నారు. ఈ ఎన్నికలు బెంగాల్ అభివృద్ధికి, బెంగాల్ చరిత్రను తిరగరాయడానికి ఉపయోగపడే ఎన్నికలు అన్నారు. భారత్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధి విషయంలో అడ్డుపడుతోందని విమర్శించారు. ప్రైవేటు రంగాల్లో సామాన్యులను ఉద్యోగాల నుంచి తొలగించి చొరబాటుదారులకు అవకాశం కల్పిస్తోందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి రాగానే టీఎంసీ మోసాలు ప్రజల ముందు ఉంచుతామని మోదీ పేర్కొన్నారు. బెంగాల్ యువతను తృణమూల్ కాంగ్రెస్ ఎంతో మోసం చేసిందని, ఆ పాపాలు ఊరికే పోవని హెచ్చరించారు. బెంగాల్‌లో డబుల్ ఇంజిన్ సర్కార్ రాగానే కేంద్ర పథకాలు ఇక్కడ అమల్లోకి వస్తాయని హామీ ఇచ్చారు. తృణమూల్ కాంగ్రెస్ హయాంలో జరిగిన అన్యాయాలు, కుంభకోణాలపై విచారణ జరిపి, కారకులైన వారిని జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. శరణార్థులకు ఆశ్రయమిస్తామని, కానీ చొరబాటుదారులను తరిమికొడతామని స్పష్టం చేశారు.

## ఫేస్ యాప్‌తో 'ఉపాధి'కి కూలీలు దూరం



**డుంబ్రిగుడ, పతాకం న్యూస్:** ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ఐరిస్ విధానాన్ని తీసుకొచ్చింది. ఎన్‌ఎంఎంఎస్ యాప్‌ను అప్‌గ్రేడ్ చేసి ఎఫ్‌ఆర్‌ఎస్‌ను అమలులోకి తెచ్చింది. ప్రతి కూలి తన కనుపాపలను యాప్ ద్వారా స్కాన్ చేయాల్సి ఉంటుంది. ఎవరైతే పేరు నమోదు చేసుకుని ఈకేవైసీ చేయించుకున్నారో వారు పనికి వెళితేనే హాజరైనట్టు గుర్తించేలా సాంకేతిక విధానాన్ని రూపొందించారు. నూతన ఆర్థిక సంవత్సరం నుంచి కూలీల హాజరు నమోదుకు ముఖ గుర్తింపు విధానం అమలు చేశారు. ప్రస్తుతం తీసుకొచ్చిన ఐరిస్ విధానం కారణంగా కొందరు కూలీలు పనులకు దూరమవుతున్నారు. మండలంలోని కొర్రా పంచాయతీలో 1,178 మంది కూలీలు ఉండగా, వారిలో ఐరిస్ యాప్‌లో ముఖ హాజరు 70 శాతం మందికి నమోదు కావడం లేదు. దీంతో వారు పనికి దూరమవుతున్నారు. యాప్ అప్‌గ్రేడ్ చేసిన తరువాత ఈ ఇబ్బంది వచ్చిందని సిబ్బంది చెబుతున్నారు.

## అభయాంజనేయ స్వామిని దర్శించుకున్న అనిత

**ఏలూరు, , పతాకం న్యూస్** అప్పన్నవీడులో గురువారం అభయాంజనేయ స్వామివారిని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికి, వేద పండితులు మంత్రికి ఆశీర్వవచనాలు అందించారు. ఆలయ పాలకవర్గం చైర్మన్ మంత్రికి అభయ ఆంజనేయ చిత్రపటాన్ని బహూకరించారు. హోంశాఖ మంత్రి అనితకు సాంప్రదాయబద్ధంగా చీర, సారెను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అందించారు. హోం మంత్రి వెంట ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), రాష్ట్ర అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, ఆలయ పాలకవర్గ సభ్యులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌పై అచ్చెన్నాయుడు ఫైర్




**అమరావతి, పతాకం న్యూస్:** తండ్రి మరణం నిర్ధరణ కాకముందే సీఎం పదవి కోసం సంతకాలు సేకరించిన వ్యక్తి జగన్ అని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. తండ్రి మరణాన్ని సానుభూతిగా మార్చుకుని ఒక్క అవకాశం అంటూ రాష్ట్రాన్ని జగన్ విధ్వంసం చేశాడని దుయ్యబట్టారు. సీఎం పదవి కోసం బాబాయి వైఎస్ వివేకాను హత్యచేసిన విషయం చిన్నపిల్లాడిని అడిగినా చెబుతారన్నారు. జగన్ జైలులో ఉన్నప్పుడు తన చెల్లి పాదయాత్ర ఎలా చేసిందో చూశామన్నారు. పార్టీ కోసం కష్టపడిన చెల్లెలికి ఆస్తిని కూడా ఇవ్వకుండా బయటకు పంపేసిన పరిస్థితి చూశామని ధ్వజమెత్తారు. " ఒక్క అవకాశమంటూ రాష్ట్రాన్ని జగన్ విధ్వంసం చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి చనిపోయిన సమయానికి ఎక్కడున్నారో జగన్ చెప్పాలి. ఇతర రాష్ట్రాల్లో ఉండాల్సిన అవసరం జగన్‌కు ఎందుకో చెప్పాలి. వైఎస్ చనిపోయారని తెలియకముందే జగన్ సంతకాలు సేకరించారు. వైఎస్ మరణంపై చాలామంది అనుమానాలు వ్యక్తం చేశారు. వైఎస్ మరణం వెనుక జగన్ హస్తం ఉందని అప్పట్లో బొత్సనే చెప్పారు. రాజశేఖర్‌రెడ్డి మరణానికి జగన్ కారణమనే అనుమానం వస్తోంది. పదవి కోసం తల్లి, చెల్లి, బాబాయ్, ఎవరినీ జగన్ వదలరని అందరికీ తెలుసు. జగన్‌ను సీఎం చేసేందుకు ఆయన చెల్లి ఎంతో కష్టపడింది. కష్టపడిన చెల్లిని ఇంటి నుంచి బయటకు గెంటేశారు. చెల్లికి సమాన వాటా ఇవ్వాలని చెబితే తల్లినీ బయటకు పంపిన వ్యక్తి జగన్" అని మంత్రి అచ్చెన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. " వైఎస్ చనిపోయిన సమయంలో జగన్ ఎక్కడ ఉన్నారో చెప్పాలి. వైఎస్ ఆచూకీ తెలియక అందరూ ఆందోళన చెందుతుంటే సీఎం పదవి కోసం పాకులాడుతారా?. ఏం జరిగిందో నిర్ధారణ కాకముందే సీఎం పదవి కోసం సంతకాల సేకరణ చేస్తారా?. రిలయన్స్ ఏజెన్సీలపై దాడి చేయించారు, మళ్లీ అదే రిలయన్స్‌ను మంచి చేసుకుని రాజ్యసభ స్థానాలిచ్చారు. చాలామంది సీనియర్ నాయకులు అనేక రకాలుగా మాట్లాడారు. వైఎస్ మృతి వెనుక జగన్ హస్తం ఉందని సాక్షాత్తూ బొత్సనే మాట్లాడారు. సభ్యసమాజంలో ఎవరూ ఇలాంటి పనిచేయరని అనుకున్నాం. ఒక సైకోకు పదవీ వ్యామోహం వస్తే, ఆ పదవి కోసం ఏమైనా చేస్తారు. తండ్రి మరణాన్ని సానుభూతిగా మలచుకొని ఎలా ప్రవర్తించారో చూశాం." అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

## శంషాబాద్ విమానాశ్రయంలో రూ.30 కోట్ల రోలెక్స్ వాచ్‌లు స్వాధీనం..

**హైదరాబాద్, పతాకం న్యూస్:** శంషాబాద్ విమానాశ్రయంలో అక్రమంగా తరలిస్తున్న బంగారం, డ్రగ్స్, గంజాయి వంటివి తరచుగా దొరకడం కలకలం సృష్టిస్తోంది. రోజుల వ్యవధిలోనే కోట్ల రూపాయల విలువైన అక్రమ వస్తువులను అధికారులు పట్టుకుంటున్నారు. పటిష్ఠ తనిఖీలు చేస్తున్న ఎయిర్‌పోర్ట్ అధికారులు.. నిందితుల నుంచి వివిధ రకాల వస్తువులను స్వాధీనం చేసుకుంటున్నారు. తాజాగా ఇవాళ(గురువారం) అక్రమంగా తరలిస్తున్న రోలెక్స్ వాచ్‌లను సీఐఎస్‌ఎఫ్ అధికారులు పట్టుకున్నారు. మట్నత్తం 30 ఖరీదైన రోలెక్స్ వాచ్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ దాదాపు రూ.18 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. వీటిని హైదరాబాద్ నుంచి ముంబైకి ఇద్దరు ప్రయాణికులు తరలిస్తున్నట్లు గుర్తించారు. వారిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. బ్యాంకాక్ నుంచి థాయ్ ఎయిర్‌లైన్స్ టీజీ-329 విమానంలో శంషాబాద్‌కు వచ్చిన 14 కిలోల గంజాయిని అధికారులు పట్టుకున్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## ఇస్తున్నాం: చంద్రబాబు

సీఎం చంద్రబాబు తెలియజేశారు. ఇదే వేదిక నుంచి గత ప్రభుత్వ పాలనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్ వంటి సైకోలు ఎంతమంది వచ్చినా అమరావతి నిర్మాణం ఆగదని స్పష్టం చేశారు. పాటు, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన తమ ప్రభుత్వ దార్శనికతను ప్రజలకు వివరించారు. అధికారుల పనితీరును సమీక్షిస్తూనే, వేమూరు నియోజకవర్గానికి పలు అభివృద్ధి పథకాలను మంజూరు చేశారు. భూమి అనేది ఆస్తి మాత్రమే కాదని, ప్రతి ఒక్కరి జీవనాధారం, గౌరవం, భద్రత అని చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వం ప్రజల భూములపై కన్నేసి, రికార్డులను తారుమారు చేసి, గ్రామాల్లో భూవివాదాలకు తెరలేపిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ సమస్యల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని విధాలా సర్వనాశనమైందని చంద్రబాబు మండిపడ్డారు. రాష్ట్ర విభజన కంటే దారుణమైన పరిస్థితులు గత ప్రభుత్వ హయాంలో నెలకొన్నాయని అన్నారు. "ఆడబిడ్డలకు రక్షణ లేదు, మాట్లాడాలంటే భయం. పరిశ్రమలు పారిపోయాయి, వ్యవస్థలన్నీ విధ్వంసమయ్యాయి" అని విమర్శించారు. తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని, వివేకానందరెడ్డి హత్య కేసులో తనను ఇరికించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. "బాబాయిని చంపేసి ఆ నేరాన్ని నా మీద వేసి, నా చేతిలో కత్తి పెట్టి నరకాసుర రక్త చరిత్ర అంటూ వారి పత్రికలో రాశారు. ఇలాంటి పగటి వేషాలతో ప్రజలను ఏమార్చి గెలిచారు" అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీని ఒక 'సైకో పార్టీ'గా అభివర్ణించిన ఆయన, ప్రతిపక్షంలో ఉన్నా బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇలాంటి రాజకీయాలు రాష్ట్రానికి ప్రమాదకరమని హెచ్చరించారు. అమరావతి నిర్మాణంపై తనకున్న నిబద్ధతను చంద్రబాబు పునరుద్ఘాటించారు. 29 వేల మంది రైతులు స్వచ్ఛందంగా 33 వేల ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ కింద ఇస్తే, గత ప్రభుత్వం రాజధానిని నాశనం చేసిందని విమర్శించారు. అమరావతి రైతులు, మహిళలు పడిన కష్టాలను గుర్తుచేసుకున్నారు. "అమరావతి ఆంధ్రప్రదేశ్ రాజధాని అని నిన్ననే కేంద్ర ప్రభుత్వం రాజముద్ర వేసింది. అయినా ఇంకా మూడు ముక్కలాట అంటున్నారు. నీలాంటి వెయ్యి మంది సైకోలు అడ్డుపడ్డా అమరావతి నిర్మాణం ఆగదు" అని చంద్రబాబు సవాల్ విసిరారు. అమరావతి కేవలం రాజధానే కాదని, హైదరాబాద్ తరహాలో సంపద సృష్టించే కేంద్రమని, దానిని పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టును కూడా గత ప్రభుత్వం గోదావరిలో కలిపేసిందని, వేల కోట్లు ఖర్చు చేసి దాన్ని మళ్లీ గాడిన పెట్టి, గోదావరి పుష్కరాలలోగా పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సభలోనే చంద్రబాబు అధికారుల పనితీరుపై సమీక్ష నిర్వహించడం విశేషం. వేమూరు నియోజకవర్గంలో ఆర్టీసీ, బీసీ సంక్షేమ హాస్టళ్లు, ఇరిగేషన్ వంటి శాఖలు రాష్ట్ర సగటు కన్నా మెరుగ్గా పనిచేస్తున్నాయని అభినందించారు. అదే సమయంలో, రేషన్ పంపిణీ, వ్యవసాయం, మధ్యాహ్న భోజన పథకం, రోడ్లు, ఇసుక సరఫరా వంటి అంశాల్లో వెనుకబడిన అధికారులను వేదికపైనే నిలదీశారు. "ఇసుక ఉచితంగా ఇస్తుంటే, మీరు ప్రజలకు అందించకుండా చెడ్డపేరు తెస్తే ఎలా?" అని మైనింగ్ అధికారిని ప్రశ్నించారు. పనితీరు బాగోలేని శాఖలు వెంటనే గాడిన పడాలని, ప్రజలకు సేవ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మరోవైపు, రాబోయే ఐదేళ్లలో 20 లక్షల కోట్ల పెట్టుబడులతో 23 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని, సూర్యలంక బీచ్‌ను ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. సభ ముగింపులో వేమూరు నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు పలు వరాలు ప్రకటించారు.

# కాలుష్య నివారణకు తక్షణమే చర్యలు తీసుకోవాలి: సీపీఎం డిమాండ్




**గాజువాక, పతాకం న్యూస్:** గాజువాకలో కాలుష్య నివారణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్‌చేశారు. గంగవరం పోర్టు, అక్కిరెడ్డిపాలెం గొడౌన్లు, విశాఖ డెయిరీ, రొయ్యల కంపెనీల నుంచి వెలువడుతున్న కాలుష్యాన్ని నివారించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో గాజువాక ప్రాంతంలో చేపట్టిన పాదయాత్ర నాలుగో రోజుకు చేరింది. అప్పన్న కాలనీ, రాజు కాలనీ, కాలిక నగర్, జాగవానిపాలెం, సాయిరాం నగర్ ప్రాంతాల్లో బుధవారం పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, గంగవరం పోర్టు, విశాఖ డెయిరీ, రొయ్యల కంపెనీల కాలుష్యం వల్ల అప్పన్న కాలనీ సహా పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాలుష్యం కారణంగా ఊపిరితిత్తుల వ్యాధులు, కేన్సర్, క్షయ వంటి ప్రాణాంతక రోగాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్యంపై స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సిపిఎం నాయకులు డాక్టర్ బి.గంగారావు, ఎం.రాంబాబు మాట్లాడుతూ, కాలుష్యం కారణంగా ప్రజలు అనారోగ్యాలకు గురవడంతో పాటు తమ ఆదాయంలో సగానికి పైగా వైద్యానికి ఖర్చు చేస్తున్నారని తెలిపారు. దీంతో ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కాలుష్య సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు లోకేష్, నమ్మి రమణ, కృష్ణ, కిరీటం, సంతోష్, అప్పారావు, లక్ష్మణస్వామి, దాసర అప్పారావు, రాము, లక్ష్మి, రమణ పాల్గొన్నారు.

## అక్రమ వసూళ్ల పై పోలీసులకు ఫిర్యాదు



**దేవరాపల్లి, పతాకం న్యూస్:** దేవరాపల్లి మండలోని ఎయంఆర్ సంస్థ పేరిట అక్రమ డబ్బు వసూళ్లు చేస్తున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు గురువారం పోలీసులకు పిర్యాదు చేసారు. బిల్లలు మెట్ట క్వారీ నుంచి ఇళ్లు నిర్మాణానికి పునాదిరాయి తరలి స్తున్న ట్రాక్టర్ యజమానుల వద్ద నుండి అధిక సీనరేజ్ వసూలు చేయడం పై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. సంస్థ ప్రతినిధులు వద్ద కనీసం గుర్తింపు కార్డులు,అయిన లెవన్నారు అధికారిక రసీదులు చూపిం చాలని కోరగా చూపించక పోవడంతో అనుమానాలు వ్యక్త మోతున్నాయని ఆరోపిస్తు వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసు స్టేషన్ ఇచ్చిన పిర్యాదులో పేర్కొన్నారు విరిగి మద్దతుగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి వెంకన్న పల్గోని మాట్లాడారు ఎయంఆర్ సంస్థ దోపిడీకి పాల్పుడు తుందని అగ్రహం వ్యక్తం చేశారు ఎవరైనా ఇల్లు నిర్మించు కుంటే ట్రాక్టరు మట్టి రెండు వందలు రూపాయలకు తీసుకునె వారని ఎయంఆర్ సంస్థ అక్రమంగా డబ్బులు వసూళు చేయడం వల్ల 800 నుండి 1000 రూపాయలు వరకు వసూళ్ళు చేస్తున్నారని తెలిపారు పూణాది రాళ్ళు తెచ్చుకుంటె దానికి ధర పెరిగి పోయాయని తెలిపారు ఇలా ప్రతి దానికీ ఎయంఆర్ సంస్థ అక్రమ వసూళ్లు వల్ల గ్రుహ నిర్మాణ దార్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు దీని వలన ఇల్లులు నిర్మించు కోలెక నిలిచి పోవడం వల్ల బిల్డింగ్ వర్క్స్ పనులు లెక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు ఈ ప్రాంతంలో ఎప్పుడు ఇటువంటి పరిస్థితి లెదని తెలిపారు ఎక్కడికక్కడ చేక్ పోస్టులు పెట్టి ఇస్టాను సారం అక్రమ వసూళ్లు చేయడం స్కేడ్ అంటూ ట్రాక్టుర్లును వెంబడించి డబ్బులు వసూళ్లు చేయడం వంటి చర్యలు దుర్మార్గమన్నారు వెంటనే అధికారులు చర్యలు చేపాట్టాలని లెదంటే మండలం లోని అన్ని ట్రాక్టుర్లును బిల్డింగ్ వర్క్స్ ను కూడా గట్టి పెద్ద ఎత్తున ఆందోళన చేపాడ తామని అయిన హెచ్చరించారు ఈకార్యక్రమంలో గోర్లే దేముళ్ళు ఎన్ దేముళ్ళు సిహెచ్ అప్పారావు అదిక సంఖ్యలో బిల్డింగ్ వర్క్స్,ట్రాక్టరు డ్రైవర్లు పాల్గొన్నారు

## ఉపాధి పనుల్లో అవినీతి

### కొలతల్లో తేడాలు, మస్తర్ల దిద్దుబాట్ల ద్వారా రూ.2 కోట్లు పక్కదారి



**కొయ్యూరు, పతాకం న్యూస్:** కొలతల్లో తేడాలతో పాటు శ్రామికుల మస్తర్లు దిద్దుబాట్లు చేసి అవినీతికి పాల్పడినట్టు ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీల్లో బట్టబయలైంది. మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం ద్వారా ఖర్చు చేసిన రూ.40.35 కోట్లకు సంబంధించి గత రెండు నెలలుగా మండలంలోని 33 పంచాయతీలలో 17వ విడత సోషల్ ఆడిట్ నిర్వహించారు. దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజా వేదికను నిర్వహించారు. పంచాయతీలవారీగా డీఆర్‌పీలు సామాజిక తనిఖీలు నిర్వహించి పనుల కొలతల్లో తేడాల ద్వారా సుమారు రూ.2 కోట్లు అవినీతికి పాల్పడినట్టు తేల్చారు. కొన్ని పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు తమ తప్పును సరిదిద్దుకుని కొలతల ప్రకారం పనులు చేయించి ఆ ఫొటోలను ప్రజావేదిక ముందు ఉంచారు. మరికొందరు జరిగిన పొరపాటును సరిచేసుకుంటామని పీడీ విద్యాసాగర్ ముందు అంగీకరించారు. ఇకపై ఇటువంటి తప్పులు జరిగితే ఉపేక్షించబోమని వారిని విద్యాసాగర్ హెచ్చరించారు. అలాగే మస్తర్లు దిద్దుబాట్లు ద్వారా కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు అవినీతికి పాల్పడినట్టు గుర్తించి వారి నుంచి రికవరీకి ఆయన ఆదేశించారు. అనంతరం పంచాయతీలవారీగా జరిగిన ఆడిట్‌లో గుర్తించిన అంశాలను డీఆర్‌పీలు ప్రజావేదిక ముందుంచారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ సీతయ్యనాయుడు, ఎస్ఆర్‌పీలు అచ్యుతరావు, చిరంజీవి, ఏవీవోలు వై.వెంకటరావు, బాలాజీ, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ వైఎంవీ రమణ, ఎంపీడీవో జీడీవీ ప్రసాద్, ఎంపీపీ రమేశ్‌బాబు, ఎస్ఎంఐ జేఈ రామకృష్ణ, 33 పంచాయతీల వీఆర్‌పీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, అధిక సంఖ్యలో జాబ్‌కార్డుదారులు పాల్గొన్నారు.

## గూగుల్ శంకుస్థాపనకు భారీ ఏర్పాట్లు



**ఆనందపురం, పతాకం న్యూస్:** ఆనందపురం మండలం తర్లువాడలో ఈనెల 28వ తేదీన జరగనున్న గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమానికి అధికారులు భారీఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా సుమారు 50వేల మందితో సభ నిర్వహించనున్నారు. కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర మంత్రులు, గూగుల్ కంపెనీ ప్రతినిధులు హాజరవుతున్నారు. జన సమీకరణకు సుమారు వెయ్యి బస్సులు సిద్ధం చేస్తున్నారు. ఈ సభను భారీగా నిర్వహించడం ద్వారా భారీ పెట్టుబడులకు రాష్ట్రంలో అనువైన వాతావరణం ఉందనే విషయం పారిశ్రామిక సంస్థలకు తెలియజేయాలని ప్రభుత్వం భావిస్తోంది. శంకుస్థాపన కార్యక్రమం నేపథ్యంలో నీలకుండీలు-విజయనగరం రోడ్డు నుంచి బాకూరుపాలెం-తర్లువాడ రోడ్డును 60 అడుగులకు విస్తరిస్తున్నారు. ప్రస్తుతం తర్లువాడ వరకు ఉన్న రోడ్డును గ్రామంలో గల స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వరకూ పొడిగిస్తారు. అదేవిధంగా హెలిప్యాడ్ ఏర్పాటుకు బుధవారం అధికారులు పలు ప్రాంతాలు పరిశీలించారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రాంగణం హెలిప్యాడ్‌కు అనుకూలంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. కాగా తర్లువాడలో సేకరించిన 316 ఎకరాల్లో 266.6 ఎకరాలు గూగుల్‌కు, మిగిలిన 51 ఎకరాలను పలు సంస్థలకు కేటాయించనున్నారు. ప్రస్తుతానికి గూగుల్‌కు 266.6 ఎకరాలు కేటాయించడంతో అక్కడ భూమి చదునుచేసే పనులు చురుగ్గా సాగుతున్నాయి. మిగిలిన 51 ఎకరాలను ఏపీఐఐసీ అభివృద్ధి చేయనున్నది. కాగా నీలకుండీల నుంచి విజయనగరం వెళ్లే రోడ్డును 150 అడుగులకు విస్తరించాలని ఇప్పటికే వీఎంఆర్‌డీఏ మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరిచింది. పారిశ్రామిక సంస్థలు వస్తున్నందున ఈ రోడ్ కూడా వేగంగా అభివృద్ధి చేయనున్నారు. తర్లువాడలో గూగుల్‌కు భూములు ఇచ్చిన రైతులకు ఎక్కడెక్కడ భూములు కేటాయించాలన్న అంశంపై ఒక నిర్ణయానికి వచ్చారు. గూగుల్ డేటా సెంటర్, ఇతర సంస్థల కోసం 316 ఎకరాలు కేటాయించారు. భూములు ఇచ్చిన రైతులకు 30 ఎకరాలు కేటాయించారు. దీనికి సంబంధించి క్షేత్రస్థాయిలో మార్కింగ్ చేశారు.

## విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటైన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో చాలా మంది రైల్వే ఉద్యోగుల ఆసక్తి




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటైన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో పనిచేయడానికి రైల్వే ఉద్యోగులు చాలామంది ఆసక్తి చూపుతున్నారు. జోన్‌కు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ వెలువడగానే సిరిపురం జంక్షన్‌లోని 'ది డెక్'లో ఏర్పాటుచేసిన తాత్కాలిక జోనల్ కార్యాలయం పూర్తిస్థాయిలో పనిచేయడం ప్రారంభిస్తుంది. ప్రస్తుతం అక్కడ వంద మంది వరకు అధికారులు, ఇతర సిబ్బంది ఉన్నారు. నోటిఫికేషన్ వచ్చిన తరువాత కనీసం 1,300 మందితో ఆపరేషన్ ప్రారంభించాలని రైల్వే ఉన్నతాధికారులు భావిస్తున్నారు. దీని కోసం విశాఖ జోన్‌లో పనిచేయడానికి ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించగా...దేశవ్యాప్తంగా మూడు వేల మందికిపైగా ఉద్యోగులు ఇక్కడకు వస్తామంటూ ఆసక్తి వ్యక్తీకరణ పత్రాలు సమర్పించారు. ఈ స్పందనపై రైల్వే అధికారులే ఆశ్చర్యపోతున్నారు. వారిలో అత్యధికులు సికింద్రాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న దక్షిణ మధ్య రైల్వే, భువనేశ్వర్ కేంద్రంగా పనిచేస్తున్న తూర్పు కోస్తా రైల్వే జోన్‌లో పనిచేస్తున్నవారే ఉండడం గమనార్హం. వీరిలో దాదాపు 700 మంది గత జనవరి నెలాఖరుకే ఆయా విభాగాల నుంచి నిరభ్యంతర పత్రాలు కూడా సమర్పించారు. అంటే వారంతా 'రెడీ టు రిలీవ్' మూడ్‌లో ఉన్నారు. ఏ క్షణంలో విశాఖపట్నం రమ్మన్నా రావడానికి సిద్ధంగా ఉన్నారు. ముడసర్లోవలో అప్పగించిన 52 ఎకరాల భూమిలో శాశ్వత జోనల్ కార్యాలయం నిర్మాణ పనులు శరవేగంతో జరుగుతున్నాయి. ఈ నిర్మాణాలకు రూ.106.89 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. ఇది కాకుండా సిబ్బందికి అవసరమైన క్వార్టర్ల నిర్మాణానికి మరో రూ.158 కోట్లు మంజూరయ్యాయి. జోన్‌లో సుమారు 18 విభాగాలు ఉంటాయి. వాటిలో 17 వేల మంది వరకు పనిచేస్తారు. ఈ జోన్‌లో విశాఖ డివిజన్‌తో పాటు గుంటూరు, గుంతకల్, విజయవాడ డివిజన్లు ఉంటాయి. ఇవన్నీ విశాఖపట్నంలోని జనరల్ మేనేజర్ ఆదేశాల మేరకు పనిచేస్తాయి. ప్రసుత్తం గెజిట్ నోటిఫికేషన్ రాకపోవడం వల్ల కొత్త జీఎం ఉన్నప్పటికీ, తూర్పు కోస్తా జీఎం ఆదేశాలనే అన్ని డివిజన్ల మేనేజర్లు పాటిస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి గెజిట్ నోటిఫికేషన్ వస్తుందని భావిస్తున్నారు.

## విజయవాడ- దువ్వాడ మధ్య 20 రైళ్లు రద్దు




**దువ్వాడ, పతాకం న్యూస్:** విజయవాడ-దువ్వాడ సెక్షన్‌లోని రాయనపాడు రైల్వేయార్డ్ రీమోడలింగ్ పనుల కారణంగా ఈ నెల 28వ తేదీ నుంచి మే 5వ తేదీ వరకు 20రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణమధ్యరైల్వే ప్రకటించింది. మరో 10 రైళ్లను దారిమళ్లించడంతో పాటు 2 రైళ్లను రీషెడ్యూల్ చేసినట్లు సీపీఆర్ఓ శ్రీధర్ తెలిపారు. రద్దు అయిన వాటిల్లో సికింద్రాబాద్-విజయవాడ- (శాతవాహన), గుంటూరు-సికింద్రాబాద్ (గోల్కొండ), విజయవాడ- భద్రాచలం (మెమో), విజయవాడ-డోర్నకల్ (మోమో), విశాఖపట్నం-మహబూబ్‌నగర్ (విశాఖ), కాకినాడ-లింగంపల్లి(గౌతమి), సంబల్‌పూర్-నాందేడ్ (నాగావళి), నాందేడ్-విశాఖపట్నం- సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళు ఉన్నాయని తెలిపారు.

## ఏసీబీకి చిక్కిన బొండాపల్లి పంచాయతీ కార్యదర్శి



**పెదబయలు, పతాకం న్యూస్:** మండలంలోని బొండాపల్లి పంచాయతీ కార్యదర్శి కంద్రేగుల లక్ష్మీనారాయణ రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. బొండాపల్లి పంచాయతీ బూరుగువీధి గ్రామానికి చెందిన దొర మల్లేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంచాయతీ కార్యదర్శిపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కడబంగి గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.2,20,000తో రెండు మంచినీటి ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణానికి దొర మల్లేశ్వరరావు కాంట్రాక్టు తీసుకున్నారు. అప్పుడు పంచాయతీ కార్యదర్శి సకాలంలో బిల్లు సమర్పించలేకపోవడంతో బిల్లు వెనక్కి వెళ్లిపోయింది. అనంతరం బిల్లును విడుదల చేయాలని సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ తీర్మానం చేసి ఆమోదించింది. ఆర్‌డబ్ల్యూఎస్ మండల ఇంజనీర్ పనులను పరిశీలించి రూ.2,27,000గా నిర్ధారించారు. ఈ మొత్తం బిల్లును ప్రాసెస్ చేయాలని పంచాయతీ కార్యదర్శిని కాంట్రాక్టర్ కోరారు. బిల్లును ప్రాసెస్ చేయడానికి బిల్లులో 50 శాతం లంచంగా ఇవ్వాలని కార్యదర్శి డిమాండ్ చేశారు. ఆ తరువాత బిల్లును 20 శాతానికి తగ్గించారు. ఒకసారి రూ.1.3 లక్షలకు బిల్లును ప్రాసెస్ చేశారు. ఈ నెల 2వ తేదీన మిగిలిన రూ.97,000 బిల్లు కూడా ప్రాసెస్ చేయాలంటే రూ.30 వేలు లంచం ఇవ్వాలని కాంట్రాక్టర్‌ను పంచాయతీ కార్యదర్శి డిమాండ్ చేశారు. చేసేది లేక ఏసీబీ అధికారులకు కాంట్రాక్టర్ ఫిర్యాదు చేశారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం కార్యదర్శి తన నివాసంలో లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. ఆ నగదుతో పాటు పనులకు సంబంధించిన పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో సిబ్బంది సుప్రియ, శ్రీనివాసరావు, వెంకట్రావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

## మన్యంలో భిన్న వాతావరణం



**పాడేరు, పతాకం న్యూస్:** మన్యంలో భిన్న వాతావరణం కొనసాగుతోంది. ఉదయం 10 గంటల వరకు దట్టంగా పొగమంచు కమ్మేసింది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంది. అరకులోయలో 33.8, కొయ్యూరులో 33.2, జి.మాడుగులలో 32.2, పెదబయలులో 30.4, చింతపల్లిలో 30.2, అనంతగిరిలో 29.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చింతపల్లిలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఈ మేరకు అరకు, పాడేరు, చింతపల్లి పరిధిలో ఈ నెల 12వ తేదీ వరకు కనిష్ఠంగా 0.1 మిల్లీమీటర్లు నుంచి గరిష్ఠంగా 6.6 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదవుతుందన్నారు.

## రెస్టారెంట్‌పై దూసుకెళ్లిన కారు



**గుంటూరు పతాకం న్యూస్:** పట్టణంలోని స్థానిక విజయ బ్యాంక్ పక్కనే ఉన్న ఈగల్ బిర్యానీ ఫ్యామిలీ రెస్టారెంట్ వద్ద గంజాయి మత్తులో ఉన్న కొందరు యువతీ యువకులు పెను బీభత్సం సృష్టించారు. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువతులు, ఇద్దరు యువకులు ప్రయణిస్తున్న కారు ఒకేసారి అదుపు తప్పి రెస్టారెంట్ బోర్డును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి ఈగల్ బిర్యానీ రెస్టారెంట్ పేరు ఉన్న స్టాండ్లతోపాటు పక్కనే ఉన్న టిఫిన్ హోటల్ సామాగ్రి కూడా పూర్తిగా ధ్వంసమై నేలమట్టమయ్యాయి. ఈ ఘటనలో తమకు సుమారు రూ.1,50,000 వరకు నష్టం వాటిల్లిందని రెస్టారెంట్ యాజమాన్యం ఆవేదన వ్యక్తం చేశారు. కారు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఫర్నిచర్, బోర్డులు ఇతర సామాగ్రి పూర్తిగా విరిగిపోయాయి. పోలీసుల రంగప్రవేశం ... సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు వెంటనే హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని కారులో ఉన్న ఐదుగురు వ్యక్తులు గంజాయి మత్తులో ఉన్నట్లు గుర్తించి వారిని వెంటనే అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రోడ్డుపై పడి ఉన్న బోర్డును, ప్రమాదానికి గురైన కారును పక్కకు తొలగించి ట్రాఫిక్ ను పునరుద్ధరించారు.

## నిబంధనలు పాటించకపోతే చర్యలు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** భవన నిర్మాణాల్లో భద్రతా ప్రమాణాలు, నిబంధనలు కచ్చితంగా పాటించాలని, కార్మికుల సంక్షేమ చర్యలు తప్పనిసరిగా అమలు చేయాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హెచ్చరించారు. విశాఖపట్టణం జిల్లాలో జరుగుతున్న భవన నిర్మాణ పనులను ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. జిల్లాలోని పలు నిర్మాణ ప్రదేశాలను పరిశీలించారు. ఎండాడలో ఎంకె.వన్, సాగర్ నగర్‌లో బూరుగుపల్లి సాగర్, మధురవాడ ఐటి సెజ్ పరిధిలో నార్త్ స్టార్ గోల్డెన్ వాలీ సంస్థల ప్రాజెక్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్మికులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం, చట్టం వారికి కల్పిస్తున్న సౌకర్యాలు, సౌలభ్యాల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా లేబర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనిఖీల్లో పలు లోపాలు బయటపడ్డాయని, ముఖ్యంగా అనేక ప్రదేశాల్లో కార్మికులకు కనీస అవసరమైన బాత్రూమ్ సౌకర్యాలు కూడా అందుబాటులో లేవని గుర్తించినట్లు చెప్పారు. కొన్ని చోట్ల కేవలం పేరుకే నిర్మించిన బాత్రూమ్‌లకు తాళాలు వేసి ఉంచడం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్మికులు మాస్కులు, గ్లౌజ్‌లు, హెల్మెట్లు, సేఫ్టీ బూట్లు వంటి రక్షణ పరికరాలు వినియోగించడం లేదని గమనించామన్నారు. సిమెంట్, ధూళి మధ్య పని చేసే కార్మికుల ఆరోగ్యానికి ఇది తీవ్రమైన ప్రమాదమని హెచ్చరించామన్నారు. కాబట్టి భద్రతా పరికరాల వినియోగం తప్పనిసరి చేయాలని కార్మిక శాఖ అధికారులను, యజమానులను ఆదేశించినట్లు వివరించారు. మీడియాతో మాట్లాడిన మంత్రి సెస్ చెల్లింపుల విషయంలో కూడా భారీ ఉల్లంఘనలు ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా కొన్ని ఎంవివి సంస్థ రూ.10 కోట్ల సెస్ బకాయిలు ఉన్నప్పటికీ చెల్లించకుండా పనులు కొనసాగిస్తోందని చెప్పారు. భవన నిర్మాణ కార్మికులు రూ.110 చెల్లించి జీవితకాలానికి నమోదు చేసుకోవచ్చని, ఈ నమోదు ద్వారా ప్రసూతి సహాయం, వివాహ సహాయం, అంత్యక్రియల ఖర్చులు, సహజ మరణానికి ఆర్థిక సహాయం వంటి పథకాలు లభిస్తాయని వివరించారు.

## సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు అండ: సంధ్యారాణి



**సాలూరు, పతాకం న్యూస్:** పేదలకు అండగా సీఎం సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఉందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సాలూరులోని క్యాంప్ కార్యాలయంలో రూ.9 లక్షల 87 వేల 512 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆమె పంపిణీ చేశారు. పట్టణంలోని 13వ వార్డులోని మండలం శ్రీనివాసరావుకు రూ.లక్షా 65 వేల 585, 21వ వార్డులోని అల్లు ఈశ్వరరావుకు రూ.44,368, 28వ వార్డులోని జమ్ము రాముకు రూ.88,210, 14వ వార్డులోని లచ్చుభూక్త పద్మావతికి రూ.32028, 7వ వార్డులోని తాడివలస గుణశేఖర్‌కు రూ.64,859, 23వ వార్డులోని జక్కు రాములుకు రూ.67,470, 29వ వార్డులోని బూర్లి ప్రవీణ్‌కుమార్‌కు రూ.3 లక్షల 50 వేల 72 చెక్కులను అందజేశారు. అలాగే పాచిపెంట మండలం విశ్వనాథపురం గ్రామానికి చెందిన తిర్లింగి అక్షయకు రూ.15 వేలు, గురివి నాయుడుపేటకు చెందిన ఈదుబిల్లి అనూరాధకు రూ.60,637, పి.కోన వలసకు చెందిన నల్లమిల్లి శ్రీనివాస రెడ్డికి రూ.48,237, మెంటాడ మండలం పోరాం గ్రామానికి చెందిన కొండపల్లి జియాంష్‌కు రూ.87,440 చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం. సంధ్యారాణి మాట్లాడుతూ ప్రజల కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోం దన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రతి పౌరుడికి మద్దతుగా ప్రభుత్వం చర్యలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం చంద్రబాబు, మంత్రి సంధ్యారాణికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తల ఉన్నారు

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



**టెక్కలి, పతాకం న్యూస్:** వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెంటనే జోక్యం చేసుకొని అకాల వర్షం వల్ల పంటలు నష్టపోయిన రైతులందరికీ వెంటనే నష్టపరిహారం అందజేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, సియటియు నాయుకులు సి.హెచ్.అమ్మన్నాయుడు యన్.వి రమణ ఆంధ్రప్రదేశ్ కౌలు రైతులు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెలమల. రమణ డిమాండ్ చేశారు. గురువారం బుడుమూరు గ్రామంలో ఇటీవల బీభత్సమైన గాలులతో కూడిన అకాల వర్షం వల్ల పంటలు నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని కోరుతూ బుడుముమూరు గ్రామ సచివాలయం వద్ద రైతులు నిరసన తెలియజేసి మండల వ్యవసాయ అధికారి డి మహేష్ నాయుడు, గ్రామ సచివాలయం కార్యదర్శి వి.అప్పలనాయుడులకు వినతిపత్రం అందజేశారు. ముందుగా నేలకొరిగిన పంటలను పరిశీలించి పంట పొలాలు వద్ద నుండి ప్రదర్శనగా వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వడగళ్ల వాన, 90 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులతో వందల ఎకరాలు మొక్కజన్న, అరటి, నువ్వుసేను, మిరప పంటలు నేలపాలు అయ్యాయని అన్నారు. రైతాంగం వడ్డీలకు అప్పులు చేసి పెట్టుబడి పెట్టి, యూరియా

# పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



**లావేరు, పతాకం న్యూస్:** మండలం లో ఇటీవల అకాల వర్షాలు, గాలులకు పంటలు నష్ట పోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. బుడుమూరులో అకాల వర్షానికి నష్టపోయిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఇటీవల ఈదురుగాలులకు వందల ఎకరా ల్లో మొక్కజొన్న, అరటి, నువ్వు, మిరప తదితర పంటలు తీవ్రంగా నష్టపోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నష్ట పోయిన మొక్క జొన్న పంట ఎకరానికి రూ.50 వేలు, మిరప పంటకు రూ.లక్ష చొప్పున పంట నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. కంచిలి మండలంలోని బూరగాం, కుత్తుమ, అమ్మవారిపుట్టుగ, కొక్కిలిపుట్టుగ తదితర గ్రామాల్లో మంగళవారం కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న కొబ్బరి, టమాటా పంటలను ఉద్యానవన శాఖాధికారి పి.మాధవీలత పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో 130 కొబ్బరి చెట్లు నేలకు ఒరిగినట్లు గుర్తించామని, టమాటా పంట సాగుచేస్తున్న 55 మంది రైతులకు చెందిన 63 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు తెలిపారు. నివేదికలను ఉన్నతాధికారులకు పంప నున్నామన్నారు. పంట నీటిలో ఉన్న టమాటా రైతులు బిల్టాక్స్ కాని కాపర్ ఆక్సీక్లోరైడ్‌ని కాని లీటరు నీటిలో మూడు గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పండిన పండ్లను వీలైనంత తొందరగా కోసివేయాలన్నారు.

## టీడీపీ నాయకత్వంపై 'డీలిమిటేషన్' ప్రభావం



**పార్వతీపురం, పతాకం న్యూస్:** నియోజకవర్గ టిడిపి నాయకత్వంపై డీలిమిటేషన్ ప్రభావం కనిపిస్తోంది. వచ్చే ఏడాదిలో నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ జరగనుందనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి ఈనెల 15, 16 తేదీల్లో పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ఆమోదించే దిశగా అడుగులు వేస్తోంది. ఈ మేరకు మన్యం జిల్లాలో నియోజకవర్గాల పునర్విభజనతో సామాజిక, రాజకీయ, భౌగోళిక స్వరూపాలు మారనున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. దీనిలో భాగంగా పార్వతీపురం నియోజకవర్గం జనరల్ కేటగిరీకి రిజర్వ్ కానున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఎస్సీ నియోజకవర్గంగా ఈ నియోజకవర్గం పునర్విభజన తర్వాత జనరల్ కానున్న నేపథ్యంలో స్థానిక రాజకీయాల్లో అలజడి మొదలైంది. ఒకప్పుడు నియోజకవర్గంతో పాటు జిల్లా రాజకీయాలను శాసించే స్థాయిలో ఉన్న బిసి నాయకత్వం వైపు పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు మొగ్గు చూపుతున్నారు. ఉమ్మడి జిల్లా టిడిపి అధ్యక్షుడిగా పని చేసిన మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ గూటికి కొంతమంది నాయకులు చేరుతున్నారు. జగదీష్ టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు. అధికారపార్టీలో పూర్వవైభవం తెచ్చుకునేందుకు ఆయన పావులు కదుపుతున్నారు. జిల్లాలో బలమైన సామాజిక వర్గానికి చెందిన నాయకుడిగా అధికారపార్టీ నాయకత్వం వద్ద గుర్తింపు వుంది. స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర వ్యవహారశైలితో పొసగని కారణంగా ఇప్పుడు రాజకీయాల్లో ఆయన క్రియాశీల పాత్ర పోషించడం లేదు. రానున్న స్థానిక ఎన్నికలకు గానీ, 2029లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు బలమైన బిసి నాయకత్వం అవసరం ఉంది. తాజా పరిస్థితుల్లో ఆయన నాయకత్వం పార్టీకి అవసరమనే చర్చ మొదలైంది. దీనిలో భాగంగా ఎమ్మెల్యే వ్యవహారశైలి, ఏకపక్ష ధోరణిని వ్యతిరేకిస్తున్న సీనియర్ నాయకులు, కార్యకర్తలు ద్వారపురెడ్డి చెంతకు చేరుతున్న పరిస్థితి కనిపిస్తోంది. కొద్దిరోజుల క్రితం పార్వతీపురం మండలం పెదబొండపల్లికి చెందిన సీనియర్ నాయకుడు ఫకీరు నాయుడు ద్వారపురెడ్డి గూటికి చేరారు. ఆయన భార్య పెదబొండపల్లి ఎంపిటిసి సభ్యురాలిగా ఉన్నారు. ఇండిపెంటెంట్‌గా పోటీ చేసి ఎంపిటిసిని గెలిపించుకున్న ఫకీరునాయుడు కొంత కాలం టిడిపిలో కొనసాగినా ఎమ్మెల్యే బోనెల తీరు నచ్చకపోవడంతో దూరంగా ఉండిపోయారు. భవిష్యత్‌లో నియోజకవర్గ పునర్విభజన తర్వాత రాజకీయ, సామాజిక సమీకరణలు మారనున్న నేపథ్యంలో ఆయన జగదీష్‌తో జతకట్టారనే వాదనలు వినిపిస్తున్నాయి. మరికొంతమంది నాయకులు, కార్యకర్తలు జగదీష్ గూటికి చేరనున్నారనే ఊహాగానాలు తెరపైకి వస్తున్నాయి. నేడు జగదీష్ చేతులు మీదుగా ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణ మండలంలోని అడ్డాపుశిల పంచాయతీ పిన్నింటి రామినాయుడువలసలో ఎన్టీఆర్ విగ్రహాన్ని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీశ్ గురువారం ఆవిష్కరించనున్నారు. గ్రామానికి చెందిన టిడిపి క్రియాశీల కార్యకర్త, యువ నాయకుడు సింగిరెడ్డి జయపాల్ సొంత డబ్బుతో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేశారు. గ్రామంలో ఆయన కొన్నేళ్లు సామాజిక కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు. వీరాభిమానిగా ఆయన సొంత ఖర్చులతో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేశారు. ఆవిష్కరణకు తొలుత ఎమ్మెల్యేను ఆయన, గ్రామ యువకులు కోరారు. విగ్రహావిష్కరణకు వస్తానని గానీ, రాబోనని గాని స్పష్టంగా చెప్పకుండా ఎమ్మెల్యే ఆ యువకులతో వ్యంగంగా మాట్లాడారని, దీంతో తాము తీవ్రంగా కలతచెందినట్టు తెలిపారు. దీంతో గ్రామస్తులంతా కలిసి ద్వారపురెడ్డి జగదీశ్‌ను ఆహ్వానించారు. నియోజకవర్గంలో మారనున్న భవిష్యత్తు రాజకీయ, సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకొని వారంతా జగదీష్ గూటికి చేరారు. గురువారం నిర్వహించనున్న విగ్రహావిష్కరణకు మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, టిడిపి సీనియర్ నాయకులు బార్నాల సీతారాం, అక్కేన పురుషోత్తమనాయుడు తదితరులను ఆహ్వానించారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ, స్థానిక ఎమ్మెల్యే వ్యవహారశైలి వెరసి పార్వతీపురంలో సరికొత్త సామాజిక, రాజకీయ పునరేకీకరణకు నాంది పలుకుతోంది.

## కేరళలో భారీగా పోలింగ్...

**కేరళ, పతాకం న్యూస్:** కేరళ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ హోరాహోరీగా, ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతోంది. గురువారం మధ్యాహ్నం 1 గంట సమయానికే రాష్ట్రంలోని 2.71 కోట్ల మంది ఓటర్లలో దాదాపు 50 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో ఈసారి పోలింగ్ శాతం సరికొత్త రికార్డులు సృష్టించే అవకాశం ఉందని అంచనాలు వెలువడుతున్నాయి. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగియనుండగా, తుది ఓటింగ్ శాతం '80%' మార్కును దాటుతుందా లేదా అనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. 1987 తర్వాత కేరళలో పోలింగ్ 80 శాతం దాటలేదు. ఎన్నికల ప్రధానాధికారి రతన్ యు. ఖేల్కర్ ఈసారి 85 శాతం పోలింగ్‌ను లక్ష్యంగా నిర్దేశించారు. 1960లో నమోదైన 85 శాతమే ఇప్పటివరకు ఆ రాష్ట్రంలో ఆల్ టైమ్ రికార్డు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఓటింగ్ సరళిలో స్పష్టమైన పెరుగుదల కనిపిస్తోంది. పినరయి విజయన్ తొలిసారి అధికారంలోకి వచ్చిన 2016 ఎన్నికల్లో 77 శాతం, ఆయన రెండోసారి గెలిచిన 2021లో 75 శాతం పోలింగ్ నమోదైంది.

## జైలులో రిమాండ్ ఖైదీ ఆత్మహత్య



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** గార మండలంలోని అంపోలు సమీపంలో ఉన్న జిల్లా జైలులో భుక్త బలరాం (27) అనే రిమాండ్ ఖైదీ ఆత్మహత్య చేసుకున్నాడు. గార ఏఎస్ఐ టి.చంద్రమోహన్, జైలు సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం ఇచ్ఛాపురం రూరల్ మండలం కేదారిపురం గ్రామానికి చెందిన బలరాం గంజాయి కేసులో పట్టుబడ్డాడు. మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఈ నెల 6న ఇచ్ఛాపురం రూరల్ పోలీసులు బలరాంను జైలుకు తీసుకొచ్చారు. రిమాండ్ ఖైదీగా ఉన్న బలరాం బేరక్‌లో ఉన్న బాత్‌రూంలో కిటికీ గజాలకు తువ్వాలతో ఉరిపోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న సిబ్బంది వెంటనే అతనిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. బలరాం మార్గమధ్యలోనే చనిపోయినట్టు రిమ్స్ వైద్యులు పేర్కొన్నట్టు ఎస్ఐ చంద్రమోహన్, జైలు సిబ్బంది తెలిపారు. జైలు సూపరింటెండెంట్ జి.మధుబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు. ఆర్డీవో సాయి ప్రత్యూష, ఏఎస్ఐ చంద్రమోహన్, జైలు సూపరింటెండెంట్ మధుబాబు జిల్లా జైలులో ఉన్న తోటి రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. సంఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యంగా పని చేయాలి




**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జిల్లాలో భూగర్భ జలాలను పెంచి, నీటి భద్రతను కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి ఆయన మండల స్థాయి బృందాలు, వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అన్నమయ్య జిల్లాలో విజయవంతంగా అమలు చేసిన జలధార కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకుని జిల్లాలో ప్రతీ గ్రామంలో అమలు చేయాలన్నారు. మండల స్థాయిలో ఏర్పాటు చేసిన బృందాలు, క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. ప్రజలు, సాగునీటి సంఘాలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సూచించారు. జూలై నాటికి నిర్దేశించిన పనులన్నీ శత శాతం పూర్తి కావాలని, ఇందుకు సంబంధించిన అనుమతుల ప్రక్రియను ఈనెల 15లోగా ముగించాలని స్పష్టం చేశారు. వంద రోజుల ప్రణాళికతో 'జలధార--జలహారతి' కార్యక్రమాన్ని, ప్రత్యేక కార్యాచరణతో యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని ఆదేశించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ.. శివారు భూములకు సాగునీరు అందేలా డ్రెయిన్లు, కాలువలకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పూడిక తొలగింపు పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకుండా మిగులు జలాలను అవసరమైన చోటికి అనుసంధానం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. పరిస్థితులకు అనుగుణంగా ఇంకుడు గుంతలు, చెక్‌డ్యాంల నిర్మాణంపై దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ లవరాజు, ఇరిగేషన్ ఎస్ఈ పొన్నాడ సుధాకరరావు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వంశధార, అటవీశాఖ అధికారులు, మండల స్థాయి బృందాల సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీశైలం నీటి ముంపు బాధితుల దీక్షలు

**నంద్యాల, పతాకం న్యూస్:** 98 జీవో నీటి ముంపు బాధితులకు ఉద్యోగాలు ఇచ్చేంతవరకు దీక్షలను కొనసాగిస్తామని నీటి ముంపు బాధితుడు నెహ్రూ నగర్ జయన్న స్పష్టం చేశారు. నందికొట్కూరు పట్టణంలోని పొట్టి శ్రీరాములు సర్కిల్ లో శ్రీశైలం నీటి ముంపు బాధితుల రిలే నిరాహారదీక్షలు గురువారంతో 15వ రోజుకు చేరుకున్నాయి. 15వ రోజుకు చేరుకోవడంతో భిక్షాటన చేస్తూ వినూత్న నిరసన చేపట్టారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ... శ్రీశైలం నీటి ముంపు బాధితులను భిక్షగాళ్లుగా మార్చిన ఘనత హామీలు ఇచ్చి మరచిన నాయకులకే చెందుతుందని ఎద్దేవా చేశారు. కుప్పంకు సాగునీరు తీసుకొని వెళ్లడానికి కాల్వపనులు ఆగమేఘాల మీద చేయించి శ్రీశైలం ముంపు బాధితులకు న్యాయం చేయడానికి ఆలస్యం ఎందుకని ప్రశ్నించారు. హామీలు ఇచ్చిన ముఖ్య నాయకులు అమలు చేయడాన్ని మరిచిపోవడం అన్యాయమన్నారు. ఎన్నికల సమయంలో నందికొట్కూరులో అడుగుపెట్టిన ప్రతి నాయకుడు మొట్టమొదటగా శ్రీశైలం ముంపు బాధితులకు ఉద్యోగాలు ఇస్తామని పలుకుతారని, గెలిచాక తెప్పతగలేసినట్లు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ప్రజా దర్బారులో కలిసి వినతి పత్రం సమర్పించామని తెలిపారు. 90 రోజులలో అర్జీని పరిష్కరిస్తామని ఆమోద పత్రం ఇచ్చారని తెలిపారు. సిఎం ఇచ్చిన గడువును కూడా అధికారులు పరిగణనలోనికి తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నెంబర్ 98 ప్రకారం 50 శాతం కోటా కింద సగం పోస్టులకు నీటి ముంపు బాధితులకు ఇవ్వాల్సి ఉండగా అవి కూడా కేటాయించకపోవడం బాధాకరమన్నారు.

## 15 నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు





**అమరావతి, పతాకం న్యూస్:** ఆధార్ బయోమెట్రిక్ నమోదుకు ఈ నెల 15 నుంచి ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు స్వర్ణ గ్రామ, వార్డుల (ఎస్‌జిఎస్‌డబ్ల్యు) శాఖ తెలిపింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లాల విద్యాశాఖ, సంబంధిత అధికారులకు ఆ శాఖ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. తొలి విడతలో ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకూ, మలి విడతలో ఈ నెల 21 నుంచి 24 వరకు ఈ శిబిరాలను స్వర్ణ గ్రామ, వార్డుల కార్యాలయాల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే మార్చి 2026 వరకు ఆధార్ నమోదు కార్యక్రమాలు పూర్తయ్యాక, రాష్ట్రంలో సుమారు 12.09 లక్షల మంది బయోమెట్రిక్ నమోదు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. గతంలో నిర్వహించిన శిబిరాల ద్వారా 79 వేల బయోమెట్రిక్ నమోదు పూర్తయ్యిందని తెలిపారు. ముఖ్యంగా 15 నుంచి 17 ఏళ్ల వయసు గల జూనియర్ కాలేజీ విద్యార్థుల బయోమెట్రిక్ నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. కొత్త ఆధార్ నమోదు, ఇతర సేవలు ఈ శిబిరాల్లో అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. జిల్లాల వారీ పరిశీలిస్తే, కర్నూలు, నంద్యాల, తిరుపతి, విశాఖపట్నం జిల్లాల్లో ఎక్కువ బయోమెట్రిక్ నమోదులు పెండింగ్‌లో ఉన్నట్లు, రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 12,09,554 పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. శిబిరాల నిర్వహణకు అవసరమైన ఆధార్ కిట్ల మొబిలైజేషన్ కోసం ప్రతి కేంద్రానికి రూ.1,000 చొప్పున నిధులు విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపిందన్నారు. అదనపు భద్రత, సహాయక చర్యల కోసం మహిళా పోలీసులను కూడా నియమించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరాలు నిర్వహించే సమయంలో డిజిటల్ అసిస్టెంట్లు, డబ్ల్యుఇడిపిఎస్‌లను ఇతర పనులకు పంపొద్దని జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## మాదకద్రవ్యాలకు, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి



**తూర్పుగోదావరి, పతాకం న్యూస్:** విద్యార్థులు ర్యాగింగ్, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఐజి ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ అన్నారు. నన్నయ యూనివర్సిటీలో ర్యాగింగ్, ఆల్కహాలిజం అండ్ డ్రగ్ అబ్యూజ్ అనే అంశంపై ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ జరిగింది. ఈ కార్యక్రమాన్ని యూనివర్శిటీ విసి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీతో కలిసి ఐజి రవికృష్ణ జ్యోత్యప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అందరూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌కు ఈగల్ కృషి చేస్తుందని, సుమారు 40 వేల విద్యా సంస్థల్లో ఈగల్ కమిటీలు నియమించి అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని జిల్లాకు ఒక సైబర్ క్రైం పోలీసు స్టేషన్ ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. సైబర్ స్పేస్ నేరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నేటి టెక్నాలజీ యుగంలో భయం, దురాశ, వ్యామోహం, అవమానం వంటివి సైబర్ నేరాల పెరుగుదలకు కారణాలు అవుతున్నాయని చెప్పారు. ఎక్కువ మంది నేరగాళ్ళు సైబర్ స్పేస్‌లో ఉన్నారని యువత అవగాహన కలిగి తల్లిదండ్రులకు, పెద్దలకు సమాజానికి అవగాహన కల్పించాలని చెప్పారు. సైబర్ నేరాలకు సంబంధించిన ఏ సమాచారం వచ్చిన టోల్ ఫ్రీ నెంబర్ 1930 కు సమాచారం అందించాలన్నారు. బెట్టింగ్ యాప్స్, లోన్ యాప్స్ బారినపడి ఆత్మహత్యలు చేసుకున్నవారు అనేక మంది ఉన్నారని ఉదాహరణలతో వివరించారు. విశ్వవిద్యాలయంలోని విద్యార్థులంతా గ్రంథాలయాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాలని, అధ్యాపకుల మార్గదర్శకంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. విసి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం కేవలం వ్యక్తిగత విషాదం కాదని, ఇది కలలను, కుటుంబాల భవిష్యత్తులను క్షీణింపజేసే సామాజిక అంటువ్యాధి అని అభివర్ణించారు. విద్య కోసం త్యాగం చేసిన తల్లిదండ్రుల గురించి, మిమ్మల్ని గౌరవించే తోబుట్టువుల గురించి ఆలోచించాలన్నారు. అనంతరం డ్రగ్స్, సైబర్ నేరాల అవగాహన పోస్టర్‌లను ఆవిష్కరించారు. అతిథులను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కెవి.స్వామి, స్టూడెంట్ అఫర్స్ డీన్ ఆచార్య ఎన్.ఉదరుభాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ శుద్ధజలానికి శ్రీకారం



**నంద్యాల, పతాకం న్యూస్:** డోన్ మండలం కొత్తబురుజు గ్రామంలో ఇంటింటికీ శుద్ధజలాన్ని అందించే లక్ష్యంతో కొళాయి కనెక్షన్ల పనులను ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. గురువారం కొత్తబురుజు గ్రామంలో జిల్లా మినరల్ ఫండ్ నుంచి రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ పనులను డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డితో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ ... గత నెల 9వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ్రామ పర్యటనలో ఇచ్చిన హామీ మేరకు ఈ పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. గ్రామంలోని ప్రతి ఇంటికి శుద్ధమైన తాగునీరు అందించడం ద్వారా ప్రజల ఆరోగ్యానికి, జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదం కలుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా, స్వచ్ఛ భారత్ మిషన్ కింద మరుగుదొడ్లు లేని 30 మంది లబ్ధిదారులకు రూ.4.5 లక్షలతో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ పనులను కూడా ప్రారంభించామని తెలిపారు. ఈ చర్యలతో గ్రామంలో పరిశుభ్రత పెరగడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు బలం చేకూరుతుందని అన్నారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన గతంలో కోరిన ఆరు పనులను ఇప్పటికే మంజూరు చేశామని, అవి సకాలంలో పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.

# భారత్‌లో పెరుగుతున్న తీవ్ర అసమానతలు!



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** మోడీ పాలనలోని గత దశాబ్ద కాలంలో భారత్‌లో అసమానతలు తీవ్రంగా పెరిగాయి. ఒకపక్క పేదలు సంక్షోభాన్ని ఎందుర్కొంటుండగా, మరోపక్క ధనికుల సంపద మాత్రం గణనీయంగా పెరిగింది. 'వెల్త్ ట్రాకర్ ఇండియా 2026' నివేదిక ఈ అసమానతను స్పష్టంగా చూపిస్తోంది. అయితే సంపన్నులపై పన్నులు విధిస్తే అది సామాజిక సంక్షేమానికి ఉపయోగపడుతోందని కూడా ఈ నివేదిక సూచిస్తోంది. బిజెపి పాలనలో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పెద్ద నోట్ల రద్దు సమయంలో ప్రజలు బ్యాంకుల ముందు క్యూలలో నిలబడ్డారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో అసంఘటిత రంగ కార్మికులు నగరాల నుంచి గ్రామాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పటికీ పరిస్థితి మారలేదు. ధరలు పెరగడం, వేతనాలు పెరగపోవడం వల్ల ప్రజలు అప్పుల్లో కూరుకుపోయారు. ఇప్పుడు మధ్య ఆసియాలో సంక్షోభంతో ఎల్‌పిజి కొరత ఏర్పడింది. దీంతో కుటుంబాలకు ఇబ్బందులు తప్పటం లేదు. పేద, మధ్య తరగతి ప్రజలు మళ్లీ కష్టాల్లో పడిపోయారు. ముఖ్యంగా నగరాల్లో పని చేసే వలసకార్మికుల వారి గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలాంటి పరిస్థితుల్లో తక్షణ సమస్యలకు పరిష్కార కోరవద్దనీ, దీర్ఘకాల ప్రయోజనాల కోసం కష్టాలను భరించాలని దేశ ఆర్థిక సలహాదారు సూచిస్తుండటం గమనార్హం. మరోవైపు దేశంలో ధనికుల పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. ప్రభుత్వం ఇచ్చే రాయితీలు, రుణ మాఫీలు, ప్రయివేటీకరణ వంటి చర్యలతో వారి సంపద భారీగా పెరిగింది. 1991లో భారత్‌లో ఒకే ఒక బిలియనీర్ ఉండగా.. 2025 నాటికి ఈ సంఖ్య 358కి పెరిగింది. ప్రస్తుతం 1688 మంది వ్యక్తులు రూ.1000 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారు. వీరి మొత్తం సంపద రూ.166 లక్షల కోట్లు. ఇది దేశ జిడిపిలో సుమారు 50 శాతానికి సమానం. కోవిడ్ తర్వాత గత ఆరు సంవత్సరాలల్లో దేశంలోని ఐదు అతిపెద్ద ధనిక కుటుంబాల సంపద 400 శాతం పెరిగింది. అదే సమయంలో దిగువ 50 శాతం మంది ప్రజల సంపద వాటా 6.8 శాతం నుంచి 6.4 శాతానికి తగ్గింది.

వెల్త్ ట్రాకర్ ఇండియా 2026 నివేదిక ప్రకారం... అత్యంత ధనికులపై తక్కువ శాతం పన్ను విధించినా భారీ మార్పులు సాధ్యమవుతాయి. ఉదాహరణకు, ముఖేశ్ అంబానీ సంపదపై రెండు శాతం పన్ను వేస్తే.. దేశంలోని ప్రతి పదో తరగతి విద్యార్థికి మూడు సంవత్సరాల పాటు ఉచిత ల్యాప్‌టాప్ ఇవ్వవచ్చు.

అలాగే గౌతమ్ అదానీ సంపదపై పన్ను వేస్తే.. దేశ ప్రజలకు రెండు ఏళ్ల పాటు ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించొచ్చు. ఇక సావిత్రి జిందాల్ సంపదపై పన్ను వేస్తే.. దేశంలోని ఎస్‌సి.ఎస్‌టి విద్యార్థుల విద్యను దశాబ్దం పాటు కొనసాగించొచ్చు. దేశంలోని 1688 మంది అతి సంపన్న కుటుంబాలపై రెండు శాతం నుంచి ఆరు శాతం వరకు పన్ను విధిస్తే.. ఏడాదికి రూ.10.63 లక్షల కోట్లు సమకూరే అవకాశం ఉంది. ఈ నిధులతో ఆరోగ్యం, విద్యపై ఖర్చు పెంచడం, వృద్ధులకు నెలకు రూ.12 వేల పెన్షన్ ఇవ్వడం వంటి కార్యక్రమాలు అమలు చేయవచ్చు.

దేశంలోని అతి సంపన్నులపై పన్ను వేస్తే వారు దేశం వదిలి వెళ్లిపోతారని కొంత మంది వాదనను, ఈ నివేదిక 'భయపెట్టే కథ'గా అభివర్ణించింది. భారత్‌లో సంస్థల లాభాలు పెరిగినా, ఉద్యోగాలు పెరగడం లేదు. వేతనాలు కూడా పెరగడం లేదు. పరిశోధన, అభివృద్ధిపై ఖర్చు జిడిపిలో 0.6 శాతం మాత్రమే. అంటే ధనికులు తమ లాభాలను దేశ అభివృద్ధికి వినియోగించడం లేదని నివేదిక వివరిస్తోంది. అతి సంపన్నులపై పన్ను వేయడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు లాభం కలుగుతోందని సూచిస్తోంది.

## 22ఎ నుంచి ఇనాం భూముల తొలగింపు



**అమరావతి, పతాకం న్యూస్:** మోడీ రాష్ట్రంలోని 1.37 లక్షల ఎకరాల విలేజ్ సర్వీస్ ఇనాం భూములను 22ఎ నుంచి తొలగిస్తూ ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ శాఖపై సమీక్షా సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం ఈ విషయం తెలిపారు. ఇతర సర్వీస్ ఇనాంలోని మరో లక్ష ఎకరాల భూములకూ విముక్తి కల్పించనున్నారు. దీని కోసం కొత్తగా చట్టం తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. 2019లో సర్వీస్ ఇనాం భూములకు సంబంధించి నాడు ఆర్డినెన్స్ జారీ చేసినప్పటికీ, తరువాత వచ్చిన ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆర్డినెన్స్ మరుగున పడిందన్నారు. రాష్ట్రం లో వచ్చే ఏడాది మార్చి నాటికి రీ సర్వే (2.0)ను పూర్తి చేసి 1.12 కోట్ల కొత్త పట్టా దారు పాసు పుస్తకాలను రైతులకు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

గత ప్రభుత్వం రీ సర్వే పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా భూ వివాదాలు సష్టించిందన్నారు. రీ సర్వే 2.0లో భాగంగా ఇప్పటికి 6,976 గ్రామాల్లో సర్వే పూర్తి కాగా, వీటితో 5,717 గ్రామాల్లో 22.79 లక్షల పాసు పుస్తకాల పంపిణీ జరుగుతోందన్నారు. సర్వే పూర్తయిన మిగిలిన 1,259 గ్రామాలకు సంబంధించి 9 లక్షల పాసు పుస్తకాలను ఈ ఏడాది జూలై నాటికి పంపిణీ చేయాలని ఆదేశిం చారు. అలాగే వచ్చే ఏడాది మార్చి నాటికి రీ సర్వేతో పాటు, పాసు పుస్తకాల పంపిణీ వంద శాతం పూర్తి కావాలని ఆదేశించారు. దీని కోసం నెలవారీ లక్ష్యాలను సిద్ధం చేసుకుని కార్యాచరణ అమలు చేయాలన్నారు. జూలై తరువాత మార్చి లోపు 80 లక్షల పాసు పుస్తకాల పంపిణీ జరగాలని స్పష్టం చేశారు. తప్పులకు ఆస్కారం లేకుండా పాసు పుస్తకాలివ్వాలని సిఎం సూచించారు.

రాష్ట్రంలో 2016కు ముందు ఏదైనా ప్రభుత్వ గృహనిర్మాణ పథకంలో పట్టా పొందిన ప్రతి ఇంటికీ రిజిస్ట్రేషన్ చేసుకునే సౌలభ్యాన్ని కల్పించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. దీంతో దాదాపు 75 లక్షల పేద కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. 2016 ముందు పట్టా కలిగిన యజమాని, నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు, విక్రయించేందుకు, గిఫ్ట్ డీడ్‌గా ఇచ్చేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో ఫ్రీ హోల్డ్ కింద 13.59 లక్షల ఎకరాల భూమి ఉండగా, ఇందులో అర్హత కలిగిన 9.25 లక్షల ఎకరాలపై భూ యజమానులకు త్వరలో పూర్తిగా యాజమాన్య హక్కులు కల్పించనున్నారు. రాష్ట్రంలోని ప్రతీ రెవెన్యూ రికార్డును డిజిటలైజ్ చేయాలని, భూ యజమానికి మొబైల్‌కి సాఫ్ట్ కాపీ పంపించాలని సూచించారు. ఈ కేవైసీ అనంతరం రికార్డులను బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో భద్రపర్చాలని ఆదేశించారు. భూ యజమానులు ఆధార్, ఈ కేవైసీ ఇచ్చి రికార్డ్ లాకింగ్ చేసుకునే సౌలభ్యం కల్పించా లన్నారు. దీంతో యజమానికి తెలియకుండా రిజిస్ట్రేషన్ సాధ్యం కాదని తెలిపారు. ప్రజల భూములకు రికార్డ్ లాకింగ్ రక్షణ కవచంగా ఉంటుం దన్నారు. సమీక్షకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, మంత్రి అనగాని సత్య ప్రసాద్, సీసీఎల్ఏ జయలక్ష్మితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కుదేలైన టమాటా రైతులు

**సోంపేట, పతాకం న్యూస్:** అకాల వర్షం టమాటా రైతును నిలువునా ముంచేసింది. మంగళవారం కురిసిన భారీ వర్షానికి వందల ఎకరాల్లో పంట నీటమునిగింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని బెంకిలి, జింకిభద్ర, పలాసపురం, లక్కవరం, బారువ తదితర గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో రైతులు టమాటాను సాగు చేస్తున్నారు. అయితే, వర్షానికి బెంకిలిలో 123మంది రైతులకు చెందిన 200ఎకరాలు, జింకిభద్రలో 148మంది రైతులకు చెందిన 126ఎకరాలు, పలాసపురంలో 42మంది రైతులకు చెందిన 50ఎకరాల పంట నీట మునిగింది. బారువ, మండపల్లి, అమ్మవారిపుట్టుగ, బంజిరి నారాయణపురం, బెల్లుపడ, కుత్తుమ తదితర గ్రామాల్లో కూడా టమాటాకు నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. దెబ్బతిన్న పంటను వ్యవసాయశాఖాధికారులు పరిశీలించారు. ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామని హార్టీకల్చర్ అధికారి మాధవీలత తెలిపారు. ఇప్పటికే ధర తగ్గి ఇబ్బందుల్లో ఉన్న తమకు ఈ అకాల వర్షం మరింత నష్టం కలిగించిందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



## శ్మశాన వాటిక సమస్యను పరిష్కరిస్తాం



**పశ్చిమ గోదావరి, పతాకం న్యూస్:** ఇరగవరం మండలంలో అర్జునపాలెం పంచాయతీ పరిధిలో గల పెద్దిరెడ్డిపాలెం శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించుటకు కృషి చేస్తామని మండల తహశీల్దార్ హామీ ఇచ్చారు. శ్మశాన వాటిక సమస్యను గ్రామస్తులు సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా చైతన్య పాదయాత్ర బృందం దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యాన బుధవారం పెద్దిరెడ్డిపాలెం ప్రజలు తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ప్రజలు వారి సమస్యలను తహశీల్దార్‌కు వివరించగా వెంటనే అధికారులను సమావేశపరిచి శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించుటకు వారితో సలహాలు సూచనలు చేశారు. ఈ సమస్యను అతి కొద్ది కాలంలో పరిష్కరిస్తామని ఆయన హామీ ఇవ్వగా ధర్నా విరమించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు మాట్లాడుతూ ప్రజాసమస్యలు తెలుసుకొనుటకు సిపిఎం ఆధ్వర్యంలో 26 రోజులు 650 కిలోమీటర్లు పాదయాత్ర జరిగిందని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం సిపిఎం కృషి చేస్తుందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ మాట్లాడుతూ దళితులకు శ్మశాన వాటికలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం జిఒ 1235 తీసుకొచ్చినా.. దాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యం జరుగుతుందన్నారు. సమస్య పరిష్కరించకపోతే సిపిఎం ఆధ్వర్యాన పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ కామన మునిస్వామి, సిపిఎం సభ్యులు తమరాపు ముసలయ్య, ఇల్లందపర్తి సత్యనారాయణ, సంఘ పెద్దలు బాలయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## జగన్‌కు రాజకీయ పరిణతి లేదు: బీవీ రాఘవులు

**శ్రీ సత్యసాయి జిల్లా, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి విషయంలో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు కీలక వ్యాఖ్యలు చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జరిగిన పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో పాల్గొన్న ఆయన... రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు గడుస్తున్నా, ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటికీ ఒక శాశ్వత రాజధాని లేకపోవడం దురదృష్టకరమని రాఘవులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వైఫల్యానికి సంబంధించి ఒకవైపు సీఎం చంద్రబాబు, మరోవైపు మాజీ సీఎం జగన్ ఇద్దరూ సిగ్గుపడాలని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాజధాని అభివృద్ధికి జరుగుతున్న కృషికి అందరూ సహకరించాలని కోరారు. జగన్‌కు రాజకీయ పరిణతి లేదని రాఘవులు నేరుగా విమర్శించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ఏదో ఒకటి మాట్లాడాలన్నట్టుగా వ్యాఖ్యలు చేయడం సరికాదని హితవు పలికారు.

## వంతెన పనులు పూర్తి చేయాలి




**కొమరాడ, పతాకం న్యూస్:** మండలంలోని పూర్ణపాడు -లాబేసు వంతెన పెండింగ్ పనులు పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు వి.ఇందిర డిమాండ్ చేశారు. మూడు పిల్లర్లు కట్టలేక అటు పాలకులు ఇటు అధికారులు వంతెన పనులను నిలిపివేశారని, వంతెనను పూర్తిచేసే వరకూ పోరాటం జరుగుతుందని తెలిపారు. వంతెన సాధన సమితి ఆధ్వర్యాన మండలంలోని గుణదలేసు పంచాయతీ లాబేసులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంతెన పనులు ప్రారంభించి 20 ఏళ్లయినా పూర్తి కాకపోవడం దారుణమన్నారు. ఈ ప్రాజెక్టు పనుల పూర్తిలో పాలకులకు చిత్తశుద్ధి లేదన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఈ నెలలోనే వంతెన పెండింగ్ పనులు ప్రారంభించాలని, లేకుంటే మళ్లీ వర్షాకాలం వస్తే ఏడాది పాటు పనులు జరగవన్నారు. భవిష్యత్తులో ఈ వంతెన గురించి తాడోపేడో తేల్చుకునేలా సాధన కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 20 వరకు రిలే నిరాహార దీక్షలు, అనంతరం ఈనెల 22న తహశీల్దార్ కార్యాలయం వద్ద మహా ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కావున నాగావళి ఆవల గల 9 పంచాయతీ ప్రజలు పార్టీలకు అతీతంగా ఈ దీక్షల్లో పాల్గొని వంతెన పెండింగ్ పనులు పూర్తి చేసేలా ఈ పోరాటంలో పాల్గొని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, లాబేసు గ్రామస్తులు పాల్గొన్నారు.

## జీవన్ రెడ్డి ఇంటి వద్ద తోపులాట.. జర్నలిస్టులకు గాయాలు

**జగతిత్యాల, పతాకం న్యూస్:** జగిత్యాలలో రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా ఉద్రిక్తతకు దారితీశాయి. మాజీ మంత్రి జీవన్ రెడ్డి నివాసం వద్ద జరిగిన తోపులాటలో మీడియా ప్రతినిధులు గాయపడటం, వారి పరికరాలు ధ్వంసం కావడం తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే... కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ తదితరులతో కలిసి జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు ఒక్కసారిగా లోపలికి దూసుకురావడంతో అక్కడ తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. అదుపుతప్పిన కార్యకర్తలు అక్కడ విధుల్లో ఉన్న మీడియా ప్రతినిధులపై పడిపోవడంతో పలువురు జర్నలిస్టులకు గాయాలయ్యాయి. తోపులాటలో ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన ఖరీదైన వీడియో కెమెరాలు కిందపడి ధ్వంసమయ్యాయి.

## పారదర్శకంగా రీ సర్వే కొలతలు చేపట్టాలి



**తూర్పుగోదావరి, పతాకం న్యూస్:** రైతుల సమక్షంలోనే పారదర్శకంగా, రీ సర్వే కొలతలు చేపట్టాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. మండలంలోని తాడిపర్రులో నిర్వహిస్తున్న ఫేజ్ 4 రీ సర్వేను ఆమె పరిశీలించారు. రీ సర్వే సమయంలో రైతులకు ముందస్తు సమాచారం అందుతుందా, కొలతలు వారి సమక్షంలోనే తీసుకుంటున్నారా, ఎటువంటి సమస్యలు ఎదురవుతున్నాయా అని ప్రశ్నించారు. నిబంధనలకు అనుగుణంగా జరగాలని స్పష్టం చేశారు. ప్రతి రైతుకు సరైన సమాచారం అందించడంతో పాటు, వారి సమక్షంలోనే కొలతలు చేపట్టాలని, ఎటువంటి అనుమానాలకు తావులేకుండా విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామస్తులు ఆమెకు పలు సమస్యలతో కూడిని వినతిపత్రాలను అందజేశారు అనంతరం పంచాయతీ కార్యాలయంలో రీ సర్వే పత్రాలను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి నుంచి డిజిటల్ అసిస్టెంట్ వరకు ప్రతి ఒక్కరు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ, గ్రామ ప్రజలకు అవసరమైన సేవలను సమయానికి అందించాలని చెప్పారు. ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో జవాబుదారీతనం, పారదర్శకత పాటించాలని ఆదేశించారు. సేంద్రియ ఎరువులను వినియోగించడం ద్వారా 25 నుంచి 30 శాతం వరకు రసాయనక ఎరువుల వినియోగం ముఖ్యంగా యూరియా వినియోగాన్ని తగ్గించవచ్చన్నారు. ఈ సందర్భంగా స్థానిక రైతు మారిశెట్టి సత్యనారాయణ సేంద్రీయ వ్యవసాయం, పిఎండిఎస్ విత్తనాలు, వాటి విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు, రైతులు గారపాటి చిన్నారావు, అక్కిన సూర్యనారాయణ, అక్కిన గోపాలకృష్ణ, గారపాటి సత్యనారాయణ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మూడు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్: ఈసీ

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. గురువారం సాయంత్రం 5 గంటలకు ఆయా రాష్ట్రాల్లో పోలింగ్ ముగిసింది. ఇప్పటి వరకు పుదుచ్చేరిలో 86.92 శాతం, అసోంలో 84.42 శాతం, కేరళంలో 7501 శాతం పోలింగ్ నమోదు అయిందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.

# 'దగ్గు'ను ఇంట్లోనే తగ్గించుకోవచ్చా? డాక్టర్ దగ్గరికి వెళ్లాలా?

దగ్గు చాలా చికాకు పెడుతుంది. ఇది పగలు పనులు చేసుకోనీయదు, రాత్రి సరిగా నిద్ర పట్టనీయదు. దీంతో దగ్గును తగ్గించుకోవటానికి చాలామంది పుదీనా బిళ్లలు చప్పరించటం, లవంగాలు నోట్లో వేసుకోవటం వంటి ఎన్నెన్నో చిట్కాలు పాటిస్తుంటారు. మరి కొందరైతే, గూగుల్, యూట్యూబ్, సోషల్ మీడియాలో ఉపశమన మార్గాలనూ వెతుకుతుంటారు. అయితే వీటి కన్నా ముందు దగ్గు తడిదా? పొడిదా? అనేది గుర్తించాలంటున్నారు నిపుణులు. ఎందుకంటే, అన్ని దగ్గులూ ఒకటి కావని చెబుతున్నారు. మరి, ఎలా గుర్తించాలో ఇప్పుడు తెలుసుకుందాం!



తడి, పొడి దగ్గు రకాలు శరీరంలో ఏం జరుగుతుందో అనే దానికి సంబంధించిన ముఖ్యమైన సూచనలు ఇస్తుంటాయని నిపుణులు చెబుతున్నారు. దీన్ని ఇంట్లోనే తగ్గించుకోవచ్చా? డాక్టర్ దగ్గరికి వెళ్లాలా? అనేవీ తెలియజేస్తాయని అంటున్నారు. ఈ క్రమంలో తడి, పొడి దగ్గు మధ్య తేడా ఏంటీ? పొడి దగ్గులో కళ్లె పడదని, గొంతులో ఏదో దురద పెడుతున్నట్టు అనిపిస్తుంటుందని వివరిస్తున్నారు. అదే తడి దగ్గులోనైతే కళ్లె పడుతుందని తెలియజేస్తున్నారు.

కారణాలు వేర్వేరే : పొడి దగ్గు చాలా వరకూ గొంతులో దురద, వాపు మూలంగా వస్తుందని నిపుణులు చెబుతున్నారు. అదే తడి దగ్గు అయితే ఇన్?ఫెక్షన్?తో పుట్టుకొచ్చిన కళ్లె వంటి వాటిని శరీరం బయటకు తోసే ప్రయత్నం చేస్తోందని అంటున్నారు. వీటిని రకరకాల అంశాలు ప్రేరేపిస్తుంటాయని వివరిస్తున్నారు.

పొడి దగ్గు ప్రేరకాలు : పొడి దగ్గు అంటే శ్లేష్మం ఉత్పత్తి చేయని దగ్గు అని, అలెర్జీలు, ఉబ్బసం, యాసిడ్ రిఫ్లక్స్, బ్రోన్కైటిస్ సాధారణ కారకాలుగా ఉన్నాయని పేర్కొంది.

తడి దగ్గు ప్రేరకాలు : బ్రాంకైటిస్, జలుబు, ఫ్లూ, సీవోపీడీ, కొవిడ్-19, న్యుమోనియా లాంటివి కారకాలుగా నిపుణులు చెబుతున్నారు. అయితే, కొన్ని దగ్గులు ఒకరకంగా మొదలై మరో రకంగానూ మారొచ్చని అంటున్నారు. ఎలాగంటే, జలుబు అనేది తడి దగ్గుతో మొదలవుతుందని, వైరస్?తో పోరాడటానికి శరీరం ఎక్కువగా కళ్లెను ఉత్పత్తి చేస్తుందని చెబుతున్నారు. దీన్ని ఊపిరితిత్తులు దగ్గు రూపంలో బయటకు వెళ్లగొడుతుంటాయని, జలుబు లక్షణాలు తగ్గిన తర్వాత దగ్గు ఉండొచ్చని వివరిస్తున్నారు. కాకపోతే అదప్పుడు పొడిగా మారుతుందని పేర్కొంటున్నారు. ఈ సమస్య కొద్ది రోజులు, నెలల వరకూ వేధించొచ్చని తెలియజేస్తున్నారు. అలాగే, ఇన్?ఫెక్షన్ తగ్గిన తర్వాత వాపు మూలంగానూ శ్వాస మార్గాలు చికాకుకు గురై పొడి దగ్గు రావొచ్చని సూచిస్తున్నారు.

ఏం చేయాలి? : దగ్గు ఏ రకమో తెలుసుకుంటే సరైన చికిత్సకు వీలుంటుందని నిపుణులు చెబుతున్నారు. తడి దగ్గు అనేది కళ్లె ద్వారా సూక్ష్మక్రిములను బయటకు నెట్టేస్తుందంటున్నారు. అదే పొడి దగ్గు అయితే శ్వాసమార్గాలకు ఉపశమనం అవసరమని వివరిస్తున్నారు. ఏ రకమైన దగ్గు అయినా తగ్గటానికి కొన్ని చిట్కాలు మేలు చేస్తాయని సూచిస్తున్నారు. ఇవి శ్వాసమార్గాల్లో చికాకు తగ్గటానికి, కఫ్లె తేలికగా బయటకు రావటానికి తోడ్పడతాయని సలహా ఇస్తున్నారు. టీ, నిమ్మకాయ రసం కలిపిన గోరు వెచ్చటి నీరు తాగటం. గొంతులో చికాకు తగ్గటానికి చెంచాడు తేనె తీసుకోవచ్చు. కాస్త ఎక్కువ నీరు తాగటం, తగినంత విశ్రాంతి తీసుకోవటమూ మేలని అధ్యయనం పేర్కొంది.

ఇలాంటి చిట్కాలేవీ పనిచేయకపోతే మందులు అవసరమవుతాయని నిపుణులు సూచిస్తున్నారు. పొడి దగ్గుకు, దగ్గును అణచిపెట్టే మందులు మేలు చేస్తాయని, ఇవి గొంతు, శ్వాసనాళం, ఊపిరితిత్తులను చికాకు పెట్టే దుమ్ము, సూక్ష్మక్రిములు వంటి వాటిని తొలగించటం ద్వారా ఉపశమనం కలిగిస్తాయని అంటున్నారు. తడి దగ్గుకైతే కళ్లె తేలికగా బయటకు వెళ్లగొట్టే సిరప్?లు(ఎక్స్?ఎక్టోరెంట్) ఉపయోగపడతాయని చెబుతున్నారు. ఈ క్రమంలో దగ్గు మందులు పెద్ద పిల్లలకు, పెద్దవారికి మాత్రమే నని గుర్తించుకోవాలని పేర్కొంటున్నారు. సాధారణంగా నాలుగేళ్లలోపు పిల్లలకు దగ్గు, జలుబు మందులు ఇవ్వరని, ఒకవేళ పిల్లలు దగ్గుతో బాధపడుతుంటే వెంటనే డాక్టర్?ను సంప్రదించి, సలహా తీసుకోవాలని సూచిస్తున్నారు.

డాక్టర్ దగ్గరికి ఎప్పుడు : ఇబ్బంది, చికాకు పెట్టినా కూడా దగ్గు ఒకరకంగా రక్షణ చర్యే అని నిపుణులు అంటున్నారు. అన్ని సమయాల్లోనూ దీన్ని అణచివేయటం సమంజసం కాదని, కొన్ని దగ్గులు క్షయ వంటి జబ్బులకు సంకేతం కావొచ్చని హెచ్చరిస్తున్నారు. తీవ్రమైన దగ్గును ఏకపక్షంగా గరిష్ఠంగా 3 వారాల పాటు ఉంటే దగ్గుగా సూచిస్తారని, చాలా మంది రోగులలో, ఇది ఎగువ శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు (%ఖ=ు×%), తీవ్రమైన బ్రోన్కైటిస్ లేదా బాక్టీరియల్ లేదా తరచుగా వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల కలిగే ట్రాకియో-బ్రోన్కైటిస్ వల్ల వస్తుందని అధ్యయనం పేర్కొంది. ప్రేరిత దగ్గు ఉన్న కొద్ది మంది రోగులు మాత్రమే వైద్య సహాయం అవసరమని సూచిస్తుంది.ఖంగుఖంగుమని మోగుతూ దగ్గుతున్నా దగ్గులో రక్తం, కళ్లె పడుతున్నా..శ్వాస తీసుకోవటం కష్టమవుతున్నా, ఆయాసం వస్తున్నా మూడు వారాలు దాటినా దగ్గు తగ్గకపోయినాజ్వరం, ఛాతీనొప్పి వంటి ఇతర ఇబ్బందికర లక్షణాలు కనిపిస్తున్నా - వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు. దగ్గుకు కారణమేంటో తెలుసుకొని, తగు చికిత్స తీసుకోవాలని సలహా ఇస్తున్నారు.

# 'లులూ మాల్'కు భూ కేటాయింపులు రద్దు

## విజయవాడలో ఆర్టీసీకి స్థలం ఉత్తర్వులు వెనక్కి తీసుకుంటున్నట్లు హైకోర్టుకు తెలిపిన ప్రభుత్వం



**విజయవాడ, పతాకం న్యూస్:** విజయవాడలో ఆర్‌టిసికి స్థలాన్ని లులూ మాల్‌కు కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలియచేసింది. ప్రభుత్వ కేటాయింపులను సవాల్ చేస్తూ రైతు నాయకుడు మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, విజయవాడకు చెందిన న్యాయవాది సీహెచ్ వెంకటేశ్వరరావు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్‌లు విచారణకు వచ్చాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ కల్పించుకుని లులూ మాల్‌కు ఆర్‌టిసి స్థలం కేటాయింపు ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేస్తుందని చెప్పారు. ఈ మేరకు ప్రభుత్వం తీసుకునే ఉత్తర్వులు త్వరలోనే వెలువడతాయని ఆయన తెలిపారు. ఆ ఉత్తర్వులకు అనుగుణంగా సమగ్ర వివరాలతో మెమో దాఖలు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ హామీని ప్రధాన న్యాయమూర్తి నేతత్వంలోని ద్విసభ్య ధర్మాసనం రికార్డుల్లో నమోదు చేసింది. దీంతో స్థల కేటాయింపు నిర్ణయాన్ని సవాలు చేసిన పిటిషన్‌ను పరిష్కరించినట్లు ధర్మాసనం ప్రకటించింది. ప్రభుత్వం ఇచ్చిన హామీని పరిగణనలోకి తీసుకున్నందున లులూ మాల్‌కు స్థల కేటాయింపులపై న్యాయవాది సత్యనారాయణ దాఖలు చేసిన వ్యాజ్యం పరిష్కరించినట్లు వెల్లడించింది. ప్రభుత్వ హామీకి విరుద్ధంగా ఆ స్థలాన్ని తిరిగి కేటాయింపు చేస్తే పిటిషనర్ తిరిగి కోర్టుకు రావచ్చునని, ఈ మేరకు పిటిషనర్‌కు వెసులుబాటు ఇస్తున్నట్లు పేర్కొంది. ఇదే వ్యవహారంపై మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు దాఖలు చేసిన వ్యాజ్యంపై విచారణను వాయిదా వేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. శోభనాద్రీశ్వరరావు తన వ్యాజ్యంలో ప్రభుత్వ భూ కేటాయింపుల విధానాన్ని సవాల్ చేసినందున ఈ పిటిషన్‌పై విచారణ చేయాల్సివుందని ధర్మాసనం తెలిపింది. ఇదే వ్యవహారంపై గతంలో దాఖలైన పిటిషన్‌తో కలిపి వడ్డే దాఖలు చేసిన వ్యాజ్యాన్ని విచారిస్తామని వెల్లడించింది. రెండు పిటిషన్లను జత చేయాలని హైకోర్టు రిజిస్ట్రీకి హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్ లతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశాలను జారీ చేసింది. లూలూ మాల్‌కు విజయవాడలో అత్యంత ఖరీదైన ఆర్టీసీ స్థలాన్ని కేటాయించడంపై ప్రజానీకంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన సంగతి తెలిసిందే. లులూ కంపెనీకి ఆర్‌టిసి స్థలం కేటాయింపు రద్దు ప్రజాపోరాట విజయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చట్టవిరుద్ధంగా, నిబంధనలు ధిక్కరించి బడా కంపెనీలకు ప్రభుత్వ స్థలాలను ధారాదత్తం చేయడం, అడ్డగోలు కేటాయింపులపై ప్రభుత్వానికి ఇదొక హెచ్చరికని పేర్కొన్నారు. రూ.400 కోట్ల విలువైన స్థలాన్ని 99 సంవత్సరాల లీజుకు కూటమి ప్రభుత్వం ఇవ్వడంపై ముఖ్యంగా సిపిఎం, వామపక్షాలు పెద్దయెత్తున ఆందోళనలు నిర్వహించాయని, ప్రజలు ముక్తకంఠంతో నిరసించారని వివరించారు. ప్రజా ఉద్యమం, న్యాయపోరాటంతో ప్రభుత్వం దిగిరాక తప్పలేదని తెలిపారు.

విజయవాడ పాత ఆర్‌టిసి బస్టాండ్ స్థలాన్ని లులూ మాల్ నిర్మాణం కోసం కేటాయించిన ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడం ప్రజల ఐక్య పోరాట ఫలితమని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పేర్కొంది. వామపక్షాలు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు కలిసి నిర్వహించిన ఉద్యమాల వల్లే ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చిందని తెలిపింది. ఇకపై ప్రభుత్వ భూములను చట్ట విరుద్ధంగా ప్రైవేటు సంస్థలకు కేటాయించకూడదని, ఆర్‌టిసి సంస్థను బలోపేతం చేసే చర్యలు తీసుకోవాలని ఫెడరేషన్ డిమాండ్ చేసింది. అలాగే విద్యుత్ బస్సుల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించకుండా, ఆర్‌టిసి ద్వారానే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది.

# లెబనాన్‌పై ఇజ్రాయిల్ భీకర దాడి



**బీరూట్-టెహ్రాన్ :** మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో అమెరికా, ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన కొన్ని గంటల్లోనే ఇజ్రాయెల్.. లెబనాన్‌పై భీకర వైమానిక దాడులకు దిగింది. ఈ దాడుల్లో 250 మందికి పైగా మరణించగా, 1100 మందికి పైగా గాయపడ్డారు. ఈ పరిణామంతో కాల్పుల విరమణ ఒప్పందం భవిష్యత్తుపై తీవ్ర నీలినీడలు కమ్ముకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి కాల్పుల విరమణను ప్రకటించారు. హోర్ముజ్ జలసంధి ద్వారా నౌకల రాకపోకలకు అనుమతించేందుకు ఇరాన్ అంగీకరించింది. అయితే, ఈ ఒప్పందం ప్రకటించిన వెంటనే ఇజ్రాయెల్.. లెబనాన్‌లోని బీరుట్, బెకా లోయతో సహా హిజ్బుల్లా స్థావరాలే లక్ష్యంగా విరుచుకుపడింది. అమెరికాతో కుదిరిన ఒప్పందం తమకు, హిజ్బుల్లాకు మధ్య జరుగుతున్న పోరాటానికి వర్తించదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. అధ్యక్షుడు ట్రంప్ కూడా లెబనాన్‌లో జరుగుతున్నది ఒక "ప్రత్యేక ఘర్షణ" అని వ్యాఖ్యానించారు. ఈ దాడులను ఐక్యరాజ్యసమితి తీవ్రంగా ఖండించింది. ఒప్పందం కుదిరిన గంటల వ్యవధిలోనే ఇంతటి మారణహోమం జరగడం నమ్మశక్యంగా లేదని యూఎన్ మానవ హక్కుల చీఫ్ వోల్కర్ టర్క్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా ఉత్తర ఇజ్రాయెల్‌పై రాకెట్లతో దాడి చేసినట్లు హిజ్బుల్లా ప్రకటించింది. "ఇజ్రాయెల్-అమెరికా దురాక్రమణ ఆగే వరకు తమ ప్రతిదాడులు కొనసాగుతాయి" అని హిజ్బుల్లా హెచ్చరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఏప్రిల్ 10న ఇస్లామాబాద్‌లో జరగాల్సిన తదుపరి చర్చలు అత్యంత కీలకంగా మారాయి. కాల్పుల విరమణ వార్తతో 95 డాలర్ల దిగువకు పడిపోయిన బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర, లెబనాన్ దాడులతో మళ్లీ 97 డాలర్లకు పెరిగింది.

మరోవైపు అమెరికాతో జరగనున్న శాశ్వత కాల్పుల విరమణ చర్చల్లో యురేనియంను శుద్ధి చేసుకునే ఇరాన్ హక్కును కాపాడుకోవడం అత్యవసరమని ఆ దేశ అణు ఇంధన సంస్థ అధిపతి మొహమ్మద్ ఎస్లామీ స్పష్టం చేశారు. ఇరాన్ దివంగత సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ సంస్మరణ కార్యక్రమాల సందర్భంగా టెహ్రాన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. శాశ్వత కాల్పుల విరమణ కోసం ఇరాన్ ప్రతిపాదించిన 10-అంశాల ప్రణాళికలో యురేనియం శుద్ధి అనేది ఒక ప్రధాన భాగమన్నారు. అయితే దీనిని అంగీకరించడానికి అమెరికా నిరాకరిస్తోందని ఎస్లామీ పేర్కొన్నారు.




# ఫిట్‌నెస్ పేరుతో ఆటకు దూరమైన విదేశీ ప్లేయర్లపై చర్యలు తీసుకోవాలి: సునీల్ గవాస్కర్



ఐపీఎల్ 2026లో విదేశీ ప్లేయర్ల గైర్హాజరు, వారి ఫిట్‌నెస్ సమస్యలు ప్రస్తుతం పెద్ద చర్చకు దారి తీశాయి. కోట్లు పెట్టి కొనుగోలు చేసిన విదేశీ ప్లేయర్లు.. జట్టులో చేరకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ ఈ విషయంపై ఘాటుగా స్పందించాడు. ఐపీఎల్‌లో తమ పాత్రను పూర్తిగా పోషించని విదేశీ ప్లేయర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. ఈ సీజన్‌లో పలువురు విదేశీ స్టార్ ప్లేయర్లు వివిధ కారణాలతో ఇంకా తమ జట్లలో చేరని విషయం తెలిసిందే. మిచెల్ స్టార్క్ గాయం నుంచి కోలుకుంటుండగా.. క్రికెట్ ఆస్ట్రేలియా ఇంకా అతడికి ఎన్‌ఓసీ ఇవ్వలేదు. మరోవైపు ప్యాట్ కమిన్స్, జోష్ హేజిల్‌వుడ్ తమ జట్లలో చేరినప్పటికీ మైదానంలోకి దిగలేదు. ఇక శ్రీలంక క్రికెట్ బోర్డు తమ ఆటగాళ్లకు ఎన్‌ఓసీ ఇవ్వలేమని తేల్చి చెప్పేసింది. హసరంగ, పతిరణ గాయాలతో ఇబ్బంది పడుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే.. కామెరూన్ గ్రీన్ విషయం మరో ఎత్తు! ఈ సీజన్ వేలంలో గ్రీన్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ ఏకంగా రూ.25.20 కోట్లకు కొనుగోలు చేసింది. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధరకు అమ్ముడైన ప్లేయర్‌గా అతడు రికార్డు సృష్టించాడు. కానీ పనిభారాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రీన్‌ను కేవలం బ్యాటింగ్‌కే పరిమితం చేస్తున్నారు. ఈ విషయంపై కేకేఆర్ కెప్టెన్ అజింక్య రహానె కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. గ్రీన్‌ను ఉద్దేశించి సునీల్ గావస్కర్ కూడా ఘాటు వ్యాఖ్యలు చేశాడు. 'ఒక మ్యాచ్‌లో ఓ బౌలర్ వేసేది నాలుగు ఓవర్లే. మరి వాళ్లు అలా చేయకుండా అడ్డుకుంటున్నదేంటి?. ఒకవేళ ఆటగాడు ఫిట్‌గా లేకుంటే టోర్నీకి ముందే వైదొలగాలి. మరో ప్లేయర్‌ను ఎంచుకునే అవకాశం ఫ్రాంచైజీకి ఇవ్వాలి. ఈ విషయాన్ని బీసీసీఐ తీవ్రంగా పరిగణించాలి. బీసీసీఐ రంగంలోకి దిగాలి. తొలి మ్యాచ్ నుంచే అందుబాటులో లేని ఆటగాళ్ల విషయంలో అమలు చేస్తోన్న నిబంధనల లాంటివే.. ఫిట్‌నెస్ పేరుతో మ్యాచ్‌లకు పూర్తిగా అందుబాటులో లేని ప్లేయర్ల కోసం ప్రవేశపెట్టాలి. పూర్తి అంకిత భావంతో ఆడే ఆటగాళ్లు ఫ్రాంచైజీలకు కావాలి' అని గావస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు.

# 1 పరుగు తేడాతో గుజరాత్ గెలుపు

ఆఖరి బంతి వరకు సాగిన ఉత్కంఠ పోరులో.. నెగ్గిన గుజరాత్ టైటాన్స్ ఐపీఎల్‌లో బోణీ కొట్టింది. హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ ఒక్క పరుగు తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై గెలిచింది. ఢిల్లీ విజయానికి 2 బంతుల్లో 2 పరుగులు కావాల్సి ఉండగా.. మిల్లర్ సింగిల్ తీస్తే స్కోరు సమమయ్యేది. కానీ, ఆఖరి బంతిని మిల్లర్ మిస్ కాగా.. కుల్దీప్ (1)ను బట్లర్ రనౌట్ చేశాడు. ?ఇఫలితం.. మ్యాచ్ గుజరాత్ సొంతం. తొలుత గుజరాత్ 20 ఓవర్లలో 210/4 స్కోరు చేసింది. శుభ్‌మన్ గిల్ (45 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సలతో 70), బట్లర్ (27 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సలతో 52), వాషింగ్టన్ సుందర్ (32 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సలతో 55) హాఫ్ సెంచరీలతో మెరిశారు. ముకేశ్ 2 వికెట్లు తీశాడు. ఛేదనలో ఢిల్లీ ఓవర్లన్నీ ఆడి 209/8 స్కోరుకే పరిమితమైంది. కేఎల్ రాహుల్ (52 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్సలతో 92), మిల్లర్ (20 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సలతో 41 నాటౌట్) పోరాటాలు వృథా అయ్యాయి. రషీద్ 3, ప్రసిద్ధ్ కృష్ణ 2 వికెట్లు పడగొట్టారు. రషీద్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. ఛేదనలో ఓపెనర్లు రాహుల్, నిస్సాంక (41) తొలి వికెట్‌కు 76 పరుగుల భాగస్వామ్యంతో జట్టుకు నిలకడైన ఆరంభాన్నిచ్చారు. ఆరో ఓవర్‌లో అశోక్ బౌలింగ్‌లో రాహుల్ బౌండ్రీ కొట్టగా.. 4,6,4,4తో నిస్సాంక బ్యాట్‌కు పనిచెప్పడంతో మొత్తం 23 పరుగులు లభించాయి. దీంతో ఢిల్లీ 63/0తో పవర్‌ప్లేను ముగించింది. అయితే, మధ్య ఓవర్లలో రషీద్ కీలక వికెట్లతో ఒత్తిడి పెంచాడు. 9వ ఓవర్ తొలి బంతికి ప్రసిద్ధ్.. నిస్సాంకను అవుట్ చేశాడు. కానీ, ఒక్కసారిగా గేర్ మార్చిన రాహుల్ రెండు ఫోర్లు, రెండు సిక్సలతో ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నాడు. కాగా, 10వ ఓవర్‌లో నితీశ్ రాణా (5), సమీర్ రిజ్వీ (0)ను రషీద్ అవుట్ చేశాడు. మిల్లర్ గాయంతో మైదానం వీడగా.. ఆ స్థానంలో వచ్చిన కెప్టెన్ అక్షర్ (2)ను కూడా రషీద్ పెవిలియన్ చేర్చాడు. స్టబ్స్ (7), రాహుల్ ఒకే ఓవర్‌లో అవుట్ కావడంతో ఢిల్లీ పనైపోయిందనుకున్నారంతా. చివరి 3 ఓవర్లలో 45 రన్స్ అవసరం కాగా.. మళ్లీ క్రీజులోకి వచ్చిన మిల్లర్ అదిరే




షాట్లతో గుజరాత్ గుండెల్లో గుబులు పుట్టించాడు. అయితే, ఆఖరి 6 బంతుల్లో 13 రన్స్ కావాల్సి ఉండగా.. విప్రాజ్ (12), మిల్లర్ బౌండ్రీ, సిక్స్ బాదారు. కానీ, చివరి బంతికి 2 పరుగులు కావాల్సి ఉండగా.. మిల్లర్ మిస్సయ్యాడు.

ఫామ్‌ను అందిపుచ్చుకొన్న బట్లర్‌తోపాటు గిల్, సుందర్ అర్ధ శతకాలతో రాణించడంతో.. గుజరాత్ భారీ స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టైటాన్స్ స్వల్ప స్కోరుకే ఓపెనర్ సాయి సుదర్శన్ (12) వికెట్ చేజార్చుకొంది. అయితే, వన్‌డౌన్ బ్యాటర్ బట్లర్ ఎడాపెడా షాట్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించగా.. మరో ఓపెనర్ గిల్ చక్కని సహకారం అందించాడు. ఈ క్రమంలో ఐదో ఓవర్‌లో ముకేశ్ బౌలింగ్‌లో బట్లర్ మూడు సిక్సలు, ఫోర్‌తో ఏకంగా 23 పరుగులు రాబట్టాడు. దీంతో పవర్‌ప్లేలో గుజరాత్ 68/1తో నిలిచింది. ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న బట్లర్‌ను కుల్దీప్ బౌల్డ్ చేయడంతో.. రెండో వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ దశలో గిల్, సుందర్ మూడో వికెట్‌కు 104 పరుగులతో ఆదుకొన్నారు. హాఫ్ సెంచరీ సాధించిన గిల్‌ను ఎన్‌గిడి పెవిలియన్ చేర్చడంతో.. డెత్ ఓవర్లలో గుజరాత్ ఆశించిన స్థాయిలో స్కోరు చేయలేక పోయింది. 6,4తో ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న సుందర్ ఆఖరి ఓవర్‌లో అవుటైనా.. ఫిలిప్స్ (14 నాటౌట్) జట్టు స్కోరును 200 మార్క్ దాటించాడు.




# పెద్దిలో మానస వారణాసి మాస్ మసాలా స్పెషల్ సాంగ్!



రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శ కత్వంలో తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రం విడుదల కోసం మెగా అభిమానులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో సినిమా రిలీజ్ మరోసారి వాయిదా పడనుందనే వార్త వారిని కాస్త నిరాశకు గురి చేస్తోంది. ముందుగా చిత్ర యూనిట్ ప్రకటించిన విడుదల తేదీ ఏప్రిల్ 30న ఈ సినిమా థియేటర్లలోకి రావడం లేదని ఫిలిం నగర్ వర్గాల సమాచారం. నిర్మాణానంతర పనుల్లో జాప్యం లేదా ఇతర సాంకేతిక కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల రామ్ చరణ్ సైతం పెద్ది చెప్పిన టైమ్ కే వస్తుందని అన్నాడు. అయినప్పటికీ పెద్ది విడుదల తేదీ విషయంలో అభిమానులకు క్లారిటీ లేకుండా పోయింది. వీశీజఅవం ఈ సినిమా విడుదల తేదీపై సందిగ్ధత నెలకొన్నప్పటికీ, చిత్రంలోని స్పెషల్ సాంగ్ గురించి జరుగుతున్న ప్రచారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ మాస్ మసాలా సాంగ్‌లో మెరవబోయే నటి ఎవరనే దానిపై కొద్దిరోజులుగా రకరకాల పేర్లు వినిపిస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం, ఇటీవల కపుల్ ఫ్రెండ్లీసినిమాతో యువతను ఆకట్టుకున్న నటి మానస వారణాసి ని ఈ పాట కోసం ఎంపిక చేసినట్లు వార్తలు వస్తున్నాయి. రామ్ చరణ్ లాంటి గ్రేట్ డ్యాన్సర్‌తో కలిసి స్టెప్పులేయడం అంటే అది ఏ నటికైనా అరుదైన అవకాశమే అని చెప్పాలి. కానీ మానస వారణాసి ఎంపికపై నెటిజన్లలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా మానస అంటే ఒక పద్ధతైన, హోమ్లీ లుక్ ఉన్న 'పక్కింటి అమ్మాయి' అనే ముద్ర ఉంది. ఆమె కెరీర్ ఆరంభంలోనే ఇలాంటి ఒక పూర్తిస్థాయి గ్లామరస్ ఐటమ్ సాంగ్‌లో నటించడం అనేది ఆసక్తికరమైన మలుపు. తనకున్న సాఫ్ట్ ఇమేజ్‌ను పక్కన పెట్టి, మాస్ ప్రేక్షకులను మెప్పించేలా గ్లామర్ డాల్‌గా మారడం ఆమెకు ఒక పెద్ద సవాలుతో కూడిన నిర్ణయం. ఈ ప్రయోగం ఆమె కెరీర్‌ను ఏ తీరానికి చేరుస్తుందో చూడాలి. ఒక రకంగా చూస్తే ఇది మానస వారణాసికి రిస్క్ అనే చెప్పవచ్చు. సాధారణంగా ఒక నటి ఐటమ్ సాంగ్‌లో కనిపిస్తే, ఆమెపై గ్లామర్ పాత్రల ముద్ర పడిపోయే ప్రమాదం ఉంది. కానీ, ఈ పాటలో తన డ్యాన్స్ మరియు ఎనర్జీతో ప్రేక్షకులను మెప్పించగలిగితే, ఆమెకు టాలీవుడ్‌లో కొత్త ద్వారాలు తెరుచుకుంటాయి. స్టార్ హీరోల సరసన నటించే అవకాశాలు పెరగడంతో పాటు, తనలోని మరో కోణాన్ని ఆవిష్కరించుకోవడానికి ఇది ఒక వేదికగా మారుతుంది. ఇమేజ్ మార్చుకోవడం అనేది కత్తి మీద సాము లాంటిదే అయినా, సక్సెస్ అయితే మాత్రం ఫలితం అద్భుతంగా ఉంటుంది.

అంతేకాకుండా, 'పెద్ది' సినిమా పాన్ ఇండియా లెవల్లో రూపొందుతోంది కాబట్టి, ఈ సినిమాలోని పాటలు దేశవ్యాప్తంగా మారుమోగిపోతాయి. ఒకవేళ ఈ ప్రత్యేక గీతం చార్ట్‌బస్టర్‌గా నిలిస్తే, మానస వారణాసికి దేశవ్యాప్త గుర్తింపు రావడం ఖాయం. ఇది ఆమె కెరీర్‌కు ఒక భారీ బ్రేక్ ఇచ్చే అవకాశం ఉంది. ఏదేమైనా, ఈ వార్తలన్నీ ప్రస్తుతం సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాలే. ఈ విషయంలో వాస్తవమెంత అనేది తెలియాలంటే చిత్ర యూనిట్ నుండి అధికారిక ప్రకటన వచ్చే వరకు మనం వేచి చూడాల్సిందే.

# నా జీవితంలో ఒక బ్రేకప్ ఉంది: కృతి శెట్టి



'ఉప్పెన' బ్యూటీ కృతి శెట్టి, 'లవ్ టుడే' ఫేమ్ ప్రదీప్ రంగనాథన్ జంటగా నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమా విడుదలకు సిద్ధమైంది. విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రమోషన్లలో ఈ ఇద్దరు సెలబ్రిటీలు తమ బ్రేకప్స్ గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారాయి.

కృతి శెట్టి మాట్లాడుతూ... తనకు గతంలో ఒకసారి బ్రేకప్ జరిగిందని వెల్లడించింది. ఈ విషయం తన తల్లికి కూడా తెలుసని, ప్రస్తుతం మాత్రం తాను సింగిల్‌గా ఉన్నానని స్పష్టం చేసింది. అలాగే సోషల్ మీడియాలో తనపై నెగిటివిటీ ప్రచారం చేసే వారిని ఏమాత్రం ఆలోచించకుండా వెంటనే బ్లాక్ చేస్తానని ఆమె క్లారిటీ ఇచ్చింది. ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ... తన లైఫ్ లో ఒకటి కాదు, చాలా బ్రేకప్స్ జరిగాయని నవ్వుతూ చెప్పాడు. అవతలి వాళ్లే తనను బ్లాక్ చేశారని నిజాయతీగా ఒప్పుకున్నాడు. కాలేజీ రోజుల్లో అమ్మాయిల మెసేజ్‌లకు తాను చాట్ జీపీటీ కంటే వేగంగా రిప్లై ఇచ్చేవాడినని, అంతలా కష్టపడినా చివరకు సింగిల్‌గానే మిగిలిపోయానని సరదాగా వ్యాఖ్యానించాడు.






# ఆయన వల్లే నేను ఇంత ధైర్యంగా ఉన్నాను: సమంత



నటి సమంత తన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితం గురించి పంచుకున్న భావోద్వేగపూరిత వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఎన్నో సవాళ్లను దాటుకుని కెరీర్‌లో దూసుకుపోతున్న సమంత, తన భర్త రాజ్ నిడమోరు తన జీవితంలో ఎంతటి కీలక పాత్ర పోషించారో వివరిస్తూ ఆనందం వ్యక్తం చేశారు.

తన జీవితంలోని ఒడిదుడుకుల సమయంలో రాజ్ తనకు అండగా నిలిచారని సమంత పేర్కొన్నారు. "నేను ఈ రోజు ఇంత ధైర్యంగా ఉండటానికి, ఒక మంచి నటిగా ఎదగడానికి ప్రధాన కారణం ఆయనే" అని ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. తనలోని నైపుణ్యాన్ని మెరుగుపరచడంలో రాజ్ నిరంతరం ప్రోత్సహిస్తారని వెల్లడించారు. తామిద్దరం వృత్తిపరమైన పనులే కాకుండా, వర్కవుట్స్ వంటి వ్యక్తిగత పనులను కూడా కలిసే చేస్తామని సమంత చెప్పారు. ఒక్క రోజు కూడా ఆయనకు దూరంగా ఉండలేనంతగా తమ మధ్య అనుబంధం ఉందని తన ప్రేమానురాగాలను చాటుకున్నారు.

ప్రస్తుతం సమంత.. రాజ్ నిర్మాణంలో వస్తున్న 'మా ఇంటి బంగారం' అనే సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రానికి నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంటూనే, తన విజయానికి మూలస్తంభంగా నిలిచిన భర్త గురించి సమంత గొప్పగా చెప్పడం ఆమె అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. వీరి జోడీ వృత్తిపరంగా, వ్యక్తిగతంగా మరిన్ని విజయాలు అందుకోవాలని నెటిజన్లు ఆకాంక్షిస్తున్నారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**